

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 31.0
కనిష్టం : 25.0

రూ.20 కోట్ల భూమికి.. రూ.2 వేలు లీజు!



వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణంలో జగన్మాయ

పేదోడి ఇంటిస్థలం కావాలంటే అడుగుల్లో లెక్క కడతారు. అచీతూచీ సరిపెట్టుకోమంటారు. సొంతిల్లు కావాలంటే పది ఇటుకలకు కూడా సరిపడినంతా లేకుండా కొద్దిపాటి సొమ్ము ఇచ్చి సర్దేస్తారు. ఏదో సందు చివర బతకడానికి ఇరవై, ముప్పై అడుగుల్లో ఓ షెడ్డు వేసుకుంటే అధికారులమంటూ క్షణాల్లో వచ్చి వాలిపోతారు. పక్కా ఇల్లు కట్టాలంటే అంతకంటే పక్కాగా మా సంగతేంటని కార్పొరేషన్ నుంచి ఠక్కున ప్రశ్న. అధికార పగ్గాలు తమ చేతిలో ఉన్నాయి కదా అని సొంతపార్టీ భవనానికి ఎలాంటి అనుమతులు లేకున్నా.. ఎంచక్కా జిల్లా కార్యాలయం నిర్మాణానికి ముహూర్తం చూసి శంకుస్థాపన చేస్తారు. ప్యాలెస్‌లా కట్టేస్తారు. ఏలూరు నడిబొడ్డున నవ్విపోదురుగాక మాకేంటి అన్నచందంగా అధికార వైసీపీ జిల్లాపార్టీ కార్యాలయం ముసుగులో చిత్ర విచిత్ర విన్యాసాలు.

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):

- అనుమతులు లేవు.. దరఖాస్తు అంతకంటే లేదు
- 33 ఏళ్లకు కారుచౌకగా కట్టబెట్టిన వైనం
- అధికారుల దగ్గర నుంచి సిబ్బంది వరకు అంతా మౌనమే
- అడిగే దిక్కూ లేదు.. చూసే ధైర్యం లేదు!
- రెండేళ్లు ఏలూరులో సాగిన వైసీపీ చిత్ర విచిత్ర విన్యాసాలు

ఏలూరు నగరంలో అల్లూరి సీతారామరాజు స్టేడియం పక్కనే ఉన్న కోట్ల విలువ చేసే రెవెన్యూ భూమిపై 2022లోనే అధికార వైసీపీ కన్నేసింది. అధికార ముసుగులో ఎంచక్కా సర్దేయాలనుకున్నారు. రెండు ఎకరాల భూమిని పార్టీ ఆస్తిగా మార్చి ఆ స్థలంలోనే అద్భుత ప్యాలెస్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అట్టహాసంగా 2022, మేలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వమే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కోట్ల విలువ చేసే రెండు ఎకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి ధారా దత్తం చేస్తున్నట్లు అప్పటి ఉత్తర్వుల సారాంశం. ఇంకేముంది అధికారం ఉంది కదా అని చుట్టూ పరదాలు కట్టేశారు. మూడో కంటికి పెద్దగా తెలియనివ్వకుండా ఆవైపు రానివ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఏడాదిలోపే నిర్మాణానికి వీలుగా భూమిని తీర్చిదిద్దారు. 2023, జనవరిలో అట్టహాసంగా జగన్ పార్టీ నేతలు శంకుస్థాపన చేశారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. అసలు ఈ భూమి ఎందుకు? ఎలా వచ్చింది? ఏకంగా ఏ పార్టీకి లేనంతగా రెండు ఎకరాల విస్తీర్ణంలో ఎలా కేటాయించారని, ఎవరైనా అడిగినా బదులిచ్చే అధికారే లేకుండా పోయారు. మూడో కంటికి తెలియకుండా గప్‌చిప్‌గా జీ+1 భవన నిర్మాణం చేపట్టారు. ఇంతకి పార్టీ కార్యాలయానికి ఎందుకు ఈ హంగామా, ఆర్భాటం అని సొంతపార్టీ నేతలు ప్రశ్నించినా... జగన్ సార్ నైట్‌హాల్ట్ చేయాలన్నా, పగటి వేళల్లో జిల్లా సమీక్షలు చేయాలన్నా ఇంత భవనం కావాలి కదా అంటూ అందరిని సర్దేశారు. తమకెందుకులే అని పార్టీనేతలే మౌనం దాల్చారు. ప్రభుత్వం ఉత్తర్వుల రూపంలో ఇచ్చిన రెండు ఎకరాల భూమి విలువ అధికారిక లెక్కల ప్రకారమే ఐదు కోట్ల పైబడి ఉండగా, పెద్ద రైల్వేస్టేషన్ ఎదురుగానే ఉన్న ఈ భూమి విలువ మార్కెట్ లెక్క ప్రకారం సరాసరి రూ.20 కోట్లకు పైబడే. అంత విలువైన భూమిని పార్టీ అవసరాలకు ధారాదత్తం చేయడానికి యంత్రాంగం ఎక్కడా అభ్యంతరం చెప్పలేదు సరికదా పైస్థాయి నేతలు ఆదేశాలను తూచా తప్పకుండా పాటించారు. భూమి కేటాయింపు దగ్గర నుంచి లీజు నిర్ణయించే వరకు చకాచకా కానిచ్చేశారు. తమ పార్టీ పెద్దల్లో ఒకరికి నిర్మాణాల్లో అనుభవం ఉన్నందున వారికే జిల్లా కార్యాలయాల నిర్మాణం బాధ్యతలను అప్పగించేశారు. ఏకంగా 13 వేల చదరపు అడుగుల్లో అంటే దాదాపు అతిపెద్ద కార్యాలయ ప్రాంగణం కానిచ్చేశారు. అత్యాధునిక సౌకర్యాలు ఇందులో అమర్చేందుకు సర్వం సిద్ధం చేశారు. జగన్ కోట మాదిరిగా ఉండేలా దీని డిజైన్‌ను రూపొందించారు. ఎలాగో అధికారంలోకి వస్తున్నాం కాబట్టి అన్న ధీమాతోనే వైసీపీ ముఖ్యమంత్రి కాన్ఫరెన్స్ నిర్వహిస్తే సమావేశ మందిరం, కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకున్న ముఖ్యులతో మాట్లాడాలి అనుకున్నా ప్రత్యేక ఛాంబర్‌లను రూపుదిద్దారు. ఇంతలా భవనం తీర్చిదిద్దేందుకు ఎలా లేదన్నా ఐదు కోట్లు పైబడే అవుతుంది. రాజ్‌మహల్‌ను తలపించే రీతిలో ఇటలీ స్ట్రెక్చర్‌ను వాడారు. నిన్న, మొన్నటివరకు బయటకు ఎవరికి కనిపించకుండా పరదాలతో దీన్ని కప్పి ఉంచారు. ఇప్పటికే 70,80 శాతం పూర్తయినా ఈ ప్యాలెస్‌ను త్వరలోనే అందుబాటులోకి తెద్దామన్నా వైసీపీ కలలు, కలలైపోగా అంతకంటే మించి పార్టీ కార్యాలయ బాగోతం వెలుగుచూసింది.

రెండేళ్లుగా ఇదంతా అదృశ్య కోటే..

సాధారణంగా మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో ఏ నిర్మాణం సాగాలన్నా ఆయా ప్లానింగ్ అధికారుల అనుమతి తప్పనిసరి. ఈ అనుమతులు కోసం సాధారణ జనం,



ఇంద్రభవనాన్ని తలపిస్తున్న ఏలూరులోని వైసీపీ కార్యాలయం

కోట్ల విలువైన భూమి... కారుచౌకగా లీజుకు

ఎక్కడైనా భూమి లీజుకు ఇవ్వాలంటే కొన్ని నిర్దిష్టమైన మార్గదర్శక సూత్రాలను పాటిస్తారు. భూమి విస్తీర్ణం ఆ ప్రాంతానికి ఉన్న విశిష్టత, రోడ్డుమార్గం, రైల్వేబస్సు సౌకర్యం వీటన్నింటిని లెక్క కడతారు. వైసీపీ అధికారంలో ఉండగా తమ పార్టీకి సొంత భవనం నిర్మించుకోవడానికి కాస్తంత స్థలం ఇవ్వాలని అడిగిన వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించింది. కోట్ల విలువైన భూమిని పార్టీకి లీజు పేరిట అప్పగించింది. రైల్వేస్టేషన్‌కు అభిముఖంగా ఉండే రెండు ఎకరాల స్థలాన్ని, అల్లూరి సీతారామరాజు స్టేడియానికి ఒకవైపు ఉండే ఈ స్థలాన్ని, ఇరిగేషన్ కార్యాలయానికి అత్యంత సమీపంలో ఉన్న ఈ భూమిని కేవలం కొంత మొత్తానికే ధారాదత్తం చేశారు. ఫైళ్ళు అన్ని చకచకా సాగాయి. దీంతో రూ.20 కోట్లు చేసే రెండు ఎకరాల భూమిని వైసీపీ జిల్లా కార్యాలయానికి ఇవ్వడమే కాకుండా ఒక్కో ఎకరాకు రూ.వెయ్యి చొప్పున రెండు ఎకరాలకు కలిపి, ఎకరానికి రూ.2 వేలు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించారు. మరోవైపు 33 ఏళ్లకు లీజును కట్టబెట్టడం ఇంకో దారుణం. ఇదంతా వైసీపీకే సాధ్యమైంది. తమంతట తాముగా నిర్దేశించి, డిజైన్ చేసిన భవనాలను నిర్మిస్తున్నా, పక్కాగా నిబంధనలు కాలరాస్తున్నా అధికార యంత్రాంగానికి అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపించింది. అధికార వైసీపీ ఆధీనంలో ఉన్న కార్పొరేషన్ నిర్మాణాలను ప్రోత్సహించిందే తప్ప ఎక్కడా ఎవరికి అక్రమ కట్టడం అంటూ నోటీసులు ఇవ్వలేదు. అసలు ఇదంతా తమ పరిధే కాదు అన్నట్లుగా వ్యవహరించింది.

పదేపదే కార్యాలయాల చుట్టూ తిరుగుతారు. ఒకరిద్దరు ఎవరైనా కొంత ఆవేశపడి అనుమతులు వచ్చేలోపే నిర్మాణం ఆరంభిద్దామని ఓ అడుగు ముందుకు వేస్తే చాలు. క్షణాల్లో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వచ్చి వాలిపోతారు. అనుమతులు ఏవంటూ నిలదీసి నానా హంగామా చేస్తారు. ఇంటి యజమానిని ముప్పుతిప్పలు పెడతారు. జేబు ఖాళీ చేయిస్తారు. కాని గడిచిన రెండేళ్లుగా ప్రభుత్వ భూమిలో అధికార పార్టీ జిల్లా కార్యాలయం కడుతున్నా కార్పొరేషన్ అధికారులకు ఎక్కడా కనిపించలేదు. అసలేంటి ఇదని ప్లానింగ్ అధికారులు ఆ వైపు తొంగిచూడలేదు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వైసీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణం సాగిస్తున్నామని, ఎలాంటి అనుమతులకు దరఖాస్తు చేసుకోలేదు. ఉన్నతస్థాయిలో అనుమతులు పొందుతామని, అప్పటివరకు సైలెంట్ అవ్వాలంటూ ఆదేశాలు రావడం అందున... మున్సిపల్ కార్పొరేషన్ వైసీపీ పాలకమండలి చేతిలో ఉండడంతో ఇక లెక్కాపక్కా లేకుండా పోయింది. ఈ వ్యవహారం బయటపడినా కూడా... అనుమతులు కోసం మాకు ఎలాంటి దరఖాస్తు రాలేదని కార్పొరేషన్ నత్తిలెక్కలు చెబుతోంది. అంతకంటే మించి కార్యాలయానికి మరి ఎలాంటి అనుమతులు ఇచ్చి నిర్మించారో తెలియదు కాని కార్యాలయానికి విద్యుత్ కనెక్షన్ ఇచ్చేశారు. అధికార యంత్రాంగం చూసీ చూడనట్లుగా వైసీపీకి లబ్ధి చేకూర్చేలా ప్రవర్తించింది. కోట్ల విలువైన స్థలాన్ని అప్పనంగా అప్పగించటమే కాకుండా ఆఖరికి అనుమతులు, నిర్మాణాలు విషయంలోనూ తుస్ అనిపించినా అడిగే దిక్కే లేకుండా పోయింది.

నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణను వివరణ కోరగా.. 'పట్టణ ప్రణాళిక విభాగం నుంచి వైసీపీ కార్యాలయాన్ని కట్టడానికి ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదు. అసలు కనీసం మాకు బిల్డింగు కట్టుకుంటామని ఎవరి నుంచి దరఖాస్తు రాలేదు. అనధికారిక కట్టడంగా గుర్తించి ప్రాథమికంగా నోటీసులు జారీ చేస్తాం. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లాం. ప్రభుత్వం, ఉన్నతాధికారుల సూచనల మేరకే తగు చర్యలు తీసుకుంటాం' అన్నారు.



వరదల సమయంలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ (ఫైల్)

పరిపాలనలో నిష్పక్షపాతం.. సమస్యల పరిష్కారానికి కృషి

- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బదిలీ.. త్వరలో రిలీవ్

ఏలూరు సిటీ, జూన్ 23 : మంచి మనసున్న వ్యక్తిగా ప్రజల మనస్సులో స్థానం సంపాదించుకున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బదిలీపై వెళుతున్నారు. జిల్లా కలెక్టర్‌గా ఆయన 2022 జనవరి 26 వ తేదీన బాధ్యతలు స్వీకరించి నాటి నుంచి నేటి వరకు జిల్లా యంత్రాంగంతో మమేకమై రాజీ పడకుండా పాలన సాగించారు. తన పనితీరుతో అటు సామాన్య ప్రజలలో సైతం అందరి మనిషిగా ఆయన విధులు నిర్వర్తించారు. పరిపాలనలో నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో తనదైన ముద్ర వేశారు. గతంలో గోదావరిలో వరదలు సంభవించిన సమయంలో సహాయ పునరావాస కేంద్రాల్లో దగ్గర ఉండి పర్యవేక్షణ చేసి బాధితులకు అండగా నిలిచారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందించటంలోను చురుకైన పాత్రను ఆయన పోషించారు. మహిళలు , పిల్లలు ఆరోగ్య, పోషణపై దృష్టి సారించి ప్రాజెక్టు అక్షజ ను సెయింట్ థెరిస్సా కళాశాల సహకారంతో, ఐటీడీఏ మండలాల్లో పోషకాహార లోపం ఉన్న పిల్లలు , రక్తహీనత ఉన్న మహిళలకు సీఎస్ఆర్ చొరవ ద్వారా అనుబంధ పోషకాహారాన్ని అందించారు. ఆ చొరవ కారణంగా 30 శాతం మంది పిల్లలు , గర్భిణులు పోషకాహారలోపం, రక్తహీనత నుంచి బయట పడ్డారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎక్సలెన్స్ పీఎం అవార్డు కోసం రెండుసార్లు ఆయన పేరును షార్ట్‌లిస్ట్ చేయడం విశేషం. సీఎస్ఆర్ నిధులతో పాఠశాలల్లో కొత్తగా 5 లైబ్రరీలు, 45 లక్షలతో కోటదిబ్బ డిగ్రీ కళాశాలకు లెక్చర్ హాల్, జిల్లా అతిథి గృహం, ఉద్యోగుల కోసం జిమ్, నిరుపేద బాలల గృహం వంటివి ఏర్పాటు చేశారు. పిల్లలు లేని తల్లి తండ్రులను అనాథ పిల్లలను దత్తత తీసుకునేలా ఆయన ప్రేరేపించారు.కొవిడ్ సమయంలో అనాధ పిల్లలకు సహాయాన్ని అందించి ఆయన కృతకృత్యులయ్యారు. కైకలూరు, దెందులూరు నియోజకవర్గాల్లో కొల్లేరు ప్రభుత్వ భూములు ఆక్రమణలను తీవ్రంగా వ్యతిరేకించి కొత్త ఆక్రమణల నుంచి కొల్లేరును కాపాడడంలో ఆయన కృషి చేశారు. ఆయుష్మాన్ భారత్ కింద ఎన్‌సీడీ-సీడీ సర్వే అండ్ ఏబీహెచ్‌ఏ హెల్త్ కార్డుల్లో ఏలూరు జిల్లా దేశంలోనే మొదటి స్థానంలో నిలవడంలో కలెక్టర్ కృషి ప్రశంసనీయమని చెప్పవచ్చు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటింగ్ శాతం 84.9 శాతానికి పెరగడంలో గడచిన ఏడాదిగా ఆయన కృషి చేశారు.

ఇప్పుడు ఏలూరు జిల్లా నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బదిలీపై వెళుతున్నారు. ఆయన జీఏడీలో రిపోర్టు చేయాల్సి ఉంది.

చుక్ చుక్ బండి.. ఇలాగైతే ఎలాగండి!

- నేటి నుంచి 26 రైళ్లు రద్దు
- ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
- నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
- ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
- కొత్త ఎంపీలు పట్టించుకోవాలని అభ్యర్థన



5

ఢిల్లీలో..దీటుగా

నేడు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పదవీ ప్రమాణం

- ఇప్పటికే ఎన్నికల్లో భారీ హామీలు ఇచ్చిన ఎంపీ
- పోలవరం, చింతలపూడి పూర్తికి అనుకూలత
- క్షేత్రస్థాయిలో పీకల్లోతు సవాళ్ళు ఎన్నో..
- అభినందనలు తెలిపిన ఎమ్మెల్యేలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి):



జిల్లాలో కొలిక్కిరాని దీర్ఘకాలిక సమస్యలకు కేంద్రనిధులతో ప్రాణం పోయాలి. తాగు, సాగునీటి కల్పనలో ప్రత్యేక పాత్ర పోషించాలి. ఏడుగురు శాసనసభ్యులకు పెద్దన్నగా మారాలి. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కారంలోనూ, అధికార యంత్రాంగాన్ని ముందుకు నడిపించడంలోనూ సమన్వయంగా... సంయమనంగా వ్యవహరించాలి. జిల్లాకు పెద్ద దిక్కుపాత్రలో లోక్‌సభకు ఎన్నికైన పార్లమెంట్ సభ్యుడే బాధ్యత తీసుకోవాల్సింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అలవోకగా తీర్చాల్సిన బాధ్యత ఎంపీదే. ఈ నేపథ్యంలోనే ఏలూరు లోక్‌సభ స్థానం నుంచి తొలిసారి ఎన్నికైన యువకుడు, విద్యా వంతుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ నేడు లోక్‌సభలో పదవీ ప్రమాణం చేయనున్నారు. ఇక ఎంపీ హోదాలో పూర్తిస్థాయిలో ప్రజా సేవలో ఇమడబోతున్నారు.

భారీ మెజార్టీతో గెలుపొందిన ఆయన ఇప్పటికే ప్రజలకు అనేక కీలక హామీలు ఇచ్చారు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ఇక్కడ ఉన్న రాజకీయ పరిణామాలను గమనించి తెలుగుదేశం ఈ మేరకు బీసీ అభ్యర్థిని ఎంపీగా గెలిపించి జిల్లా అభివృద్ధికి కొత్త బాటలు వేయాలని అప్పట్లోనే వ్యూహం రచించారు. ఇంతకు ముందు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి అందరూ అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులే గెలుపొందుతూ వచ్చారు. సామాజిక వర్గాల వారీగా ఎలాంటి విభజన లేకుండా ఏ పార్టీ అయినా ఇదే కోణంలో ఆలోచించి ఎన్నికల బరిలో నిలిపేవారు. కాని ఈసారి కూటమిగా ఏర్పడిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఆసాంతం ఎన్నికల వ్యూహాన్ని విజయవంతంగా అమలుచేశాయి. సామాజిక వర్గాలను కూడకట్టుకునే క్రమంలో యాదవ సామాజిక వర్గం నుంచి ఎంపీ స్థానానికి ప్రాతినిధ్యం కల్పించాలని యోచించారు. ఇదే క్రమంలో వైసీపీ ఆ వైపే అడుగులు వేసి తమపక్షాన బీసీ అభ్యర్థిని రంగంలోకి దించింది. కూటమి కూడా బీసీ అభ్యర్థిగా మహేష్‌ను బరిలోకి దింపి గెలుపు సాధించే దిశగా సకల సన్నాహాల్లోనూ రాణించింది. దీనికి తోడు కొద్దిరోజుల వ్యవధిలోనే మహేష్ తనకంటూ ఒక ముద్రపడేలా శరవేగంగా ప్రజలతో కలిసి పోయారు. తన లక్ష్యం ఏమిటో ప్రజలకు వివరించారు. తనను ఎంపీగా గెలిపిస్తే తాను ఏం చేయదలచింది స్పష్టతతో కూడిన హామీలు ప్రజల ముందు ఉంచారు. ఇదే ఆయన విజయానికి భారీగా దోహదపడింది.

ఇప్పుడున్న లక్ష్యాలు ఆషామాషీ కాదు

తాను ఎంపీగా ఎన్నికైతే రాష్ట్రంలోనే అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు అందిస్తే చింతలపూడి ఎత్తిపోతల సమాంతరంగా మిగతా సాగునీటి పనులు అన్నింటిని ఈ ఐదేళ్లల్లో పూర్తిచేస్తానని పదేపదే ప్రజలకు భరోసా ఇస్తూ వచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇప్పటికే అనేక సవాళ్ళు కళ్ళఎదుటే కనిపిస్తున్నాయి. పోలవరం పూర్తికి పార్లమెంట్‌లో కూటమి పక్షాన కేంద్రాన్ని ఒప్పించే విధంగా ప్రధాన పాత్ర, భూమిక పోషించాలి. ఇంకో వైపు చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని లక్ష్యంగా ఎంచుకున్నందున ఈ ఎత్తిపోతల పూర్తికి నిధుల లోటే ఆటంకం. ఇప్పుడు ఆ దిశగానే పార్లమెంట్‌లో ప్రస్తావించడం, కేంద్రంలో పోలవరంకు అనుకూలంగా ఒప్పించే విధంగానే రాష్ట్రంలోను చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసేందుకు సీఎం చంద్రబాబును మెప్పించే విధంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎంపీతో పాటు ఇదే జిల్లాలో ఉన్న ఏడుగురు ఎమ్మెల్యేలది కూడా. ఇంకోవైపు ఎక్కడాలేని విధంగా తాను గెలిస్తే నిరుద్యోగ సమస్య తీర్చేందుకు అత్యధికులకు ఉద్యోగాలు లభించేలా చూస్తానని, దీనికి గాను పారిశ్రామికీకరణ చేసి చూపిస్తానని మహేష్ ప్రజలకు గట్టి హామీ ఇచ్చారు. ఇప్పుడు దీనిపై కూడా దృష్టిపెట్టాల్సి ఉంది. ఏలూరులో కాస్తోకూస్తో కొంతమందికి ఉపాధి కల్పించే జూట్‌మిల్లు లాకౌట్ అయింది. దీనికి సమాంతరంగా మరికొన్ని పరిశ్రమలు తెస్తేతప్ప ఏలూరు లో మధ్యతరగతి కుటుంబాలకు కాస్తంత ఆదరువు దక్కే పరిస్థితి లేదు.

పుట్టాకు కూటమి పక్షాన అభినందనలు

లోక్‌సభలో పదవీ ప్రమాణం చేయనున్న ఎంపీ పుట్టాకు కూటమి పక్షాన ఇప్పటికే పలువురు అభినందనలు తెలిపారు. ప్రజా సమస్యలను దృష్టిలో పెట్టుకుని తెలుగువారిగా... గోదావరి జిల్లాల ప్రతినిధిగా సాగు,తాగునీటి సమస్యలపై లోక్‌సభలో ఏకరువు పెట్టాలని, ప్రధాన సమస్యలు అన్నింటి పైన తక్షణ పరిష్కారానికి ప్రయత్నించాలని ఆ లక్ష్యంగా మీరు వేసే ప్రతి అడుగు విజయవంతం కావాలని ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యేలంతా అభినందనలు తెలిపారు.

జిల్లాలో కుంభవృష్టి

- అత్యధికంగా జీలుగుమిల్లిలో 97.6 మి.మీ వర్షపాతం

ఏలూరు సిటీ, జూన్ 23 : జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావం ఇప్పుడిప్పుడే కనిపిస్తోంది. జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు పడుతున్నాయి. శనివారం రాత్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పిడుగులు, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీగానే వర్షపాతం నమోదైంది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. గడచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా జీలుగుమిల్లి మండలంలో 97.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 35.3 మి.మీగా నమోదైంది. బుట్టాయిగూడెంలో 94.4, నిడమర్రు 92.8, కొయ్యలగూడెంలో 84.6, చింతలపూడి 84.2, జంగారెడ్డిగూడెం 79.4, పోలవరం 59.8, ఉంగుటూరు 50, వేలేరుపాడు 50, కామవరపుకోట 41.4, టి.నరసాపురం 38.2, ద్వారకా తిరుమల 38, నూజివీడు 32.4, లింగపాలెం 28.6, కుక్కునూరు 25.2, ముసునూరు 24.8, ఆగిరిపల్లి 14.6, కలిదిండి 14.6, చాట్రాయి 10.8 వర్షపాతం నమోదైంది.

వర్షానికి కుప్పకూలిన రేకులషెడ్డు

ద్వారకా తిరుమల : ద్వారకా తిరుమలలో శనివారం రాత్రి నుంచి విడవకుండా కురుస్తున్న వర్షానికి ఓ రేకుల షెడ్డు ఆదివారం తెల్లవారుజామున కుప్పకూలింది. స్థానిక వసంత్‌నగర్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో పిండ్రాల పోసియ్య, వెంకటలక్ష్మి దంపతులు కుటుంబంతో కలసి ఓ చిన్న షెడ్డు వేసుకుని జీవిస్తున్నారు. ఆదివారం ఉదయం 5గంటల సమయంలో రేకులు పెద్ద మోత వస్తుండడంతో మెలుకువ వచ్చి భయంతో బయటకు పరుగులు తీశారు. ఇంతలో అది పెద్ద శబ్దం చేస్తూ కుప్పకూలింది. లోపల ఉన్న సామగ్రి ధ్వంసం అయ్యింది. సుమారు రూ.50 వేలు వరకు నష్టం వాటిల్లిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.





ద్వారకా తిరుమల వసంత్‌నగర్ కాలనీలో కుప్పకూలిన రేకుల షెడ్డు.. ప్రమాదం నుంచి బయట పడిన బాధితులు

ఈ-టెండరు-సహిత-వేలం అమ్మకం నియమ నిబంధనలు :
1. కాగోరు బిడ్డర్లు వేలంలో స్వయంగా పాల్గొనవలెను మరియు వ్యక్తిగతంగా పాల్గొనాలి మరియు అందుకు సంబంధించి అతని/ఆమె కొరకే అతను/ఆమె బిడ్డింగ్ వేస్తున్నట్లు వ్రాతపూర్వక ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. 2. కాగోరు బిడ్డర్లు ది మేనేజర్, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్, ఏలూరు శాఖ, డి.నం.22సి-14-11, గ్రౌండ్ ఫ్లోర్, టివికె మాల్, పుణ్యమూర్తుల వారి వీధి, పవర్‌పేట్, ఏలూరు, పశ్చిమగోదావరి-534002. వారి నుండి టెండరు ఫారాలను పొందవచ్చును. 3. కాగోరు బిడ్డర్లు వారి బిడ్లను "సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్" పేరున తీసిన రిజర్వు ధరలో 10 శాతం బయానా కొరకు డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ రూపంలో ఉన్నదానితోపాటుగా ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదిన మ.12.00 గం.కు లేదా అలోగా అధీకృత అధికారి, సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ వారి చిరునామాకు సీల్డు ఎన్వలప్‌లలో నిర్దిష్టపరిచిన టెండరు ఫారంలో మాత్రమే వారి బిడ్లను దాఖలు చేయవలెను. 4. ఆస్తి తనిఖీ మరియు ఇతర వివరాల కొరకు కాగోరు కొనుగోలుదారు టెలిఫోన్ నం.0881-2240340, సెల్ నం.9347078103లను సంప్రదించవచ్చును. 5. ఆస్తి / ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా", "అక్కడ ఏది ఉన్నదో అది" మరియు "ఏది ఎక్కడ ఉంటే అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి. 6. ఇందులో తెలిపిన టెండరు-సహిత-వేలం అమ్మకం తేదిన మ.01.00 గం.కు కాగోరు బిడ్డర్ల సమక్షంలో సీల్డ్ టెండర్లు తెరవబడతాయి. అమ్మకం సాధారణంగా ముగింపు టెండర్ల రూపంలోనే ఉంటుంది. అధీకృత అధికారి అతని విచక్షణ మేరకు టెండరు ప్రక్రియ ముగింపు సమయంలో స్వీకరించబడిన దానికన్నా అత్యధిక బిడ్‌ను కోట్ చేయుటకు ఆసక్తి వ్యక్తం చేసిన బిడ్డర్ల మధ్య బహిరంగ వేలం నిర్వహించవచ్చును మరియు అటువంటి సందర్భంలో అత్యధిక బిడ్ వేసిన వ్యక్తికే అమ్మకం సంక్రమిస్తుంది. అయితే అమ్మకం సిటీ యూనియన్ బ్యాంక్ లిమిటెడ్ నిర్ధారణకు లోబడి ఉంటుంది. 7. గెలుపొందిన బిడ్డరు అమ్మకం పూర్తయిన వెంటనే అమ్మకం మొత్తంలో 25% (చెల్లించిన బయానా కలిపి) చెల్లించాలి మరియు మిగిలిన 75% మొత్తమును అమ్మకం నిర్ధారణ తేది నుండి 15 రోజులలోగా చెల్లించాలి. లేనిచో ముందుగా డిపాజిట్ చేసిన 25% మొత్తం స్వాధీనం చేసుకొనబడుతుంది. 8. ఇందులో నిర్దిష్టపరచిన కాలవ్యవధిలోగా మొత్తం అమ్మకం ప్రతిఫలం అందుకున్న తరువాత మాత్రమే గెలుపొందిన కొనుగోలుదారు పేరు మీద అమ్మకం సర్టిఫికెట్‌ను అధీకృత అధికారి జారీ చేస్తారు. 9. చట్టం క్రింద వర్తించు విధంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు వంటి కన్వేయన్స్ కొరకు చెల్లించాల్సిన చార్జీలు/ఫీజులు గెలుపొందిన కొనుగోలుదారు భరించవలసి ఉంటుంది. 10. ప్రభుత్వానికి, ప్రభుత్వ రంగ సంస్థలకు మరియు స్థానిక సంస్థలకు బకాయిలు ఉన్న ఏమైన చట్టబద్ధ బకాయిలు (న్యాయపరంగా ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు మరియు ఇతర బకాయిలు) TDS, GST గెలుపొందిన బిడ్డరే చెల్లించాలి. 11. ఎటువంటి కారణం తెలియజేయకుండా బిడ్లను అంగీకరించు లేదా తిరస్కరించు లేదా అమ్మకాన్ని వాయిదా వేయు లేదా రద్దు చేయు అన్ని అధికారాలు అధీకృత అధికారి కలిగి ఉన్నారు.

ప్రదేశం : కుంబకోణం, తేది : 21.06.2024 — అధీకృత అధికారి

నమోదిత కార్యాలయం: 149, T.S.R. (Big) స్ట్రీట్, కుంబకోణం, తంజావూరు జిల్లా, తమిళనాడు-612001, CIN - L65110TN1904PLC001287
టెలిఫోన్ నం.0435-2402322, ఫ్యాక్స్:0435-2431746, వెబ్‌సైట్:www.cityunionbank.com

నిధులు దారి మళ్లించిన అధికారులపై విచారణ జరపాలి

» ఉమ్మడి పశ్చిమ జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు గోపాలరావు


గోపాలరావు

ఏలూరు రూరల్, జూన్ 23 : గ్రామ పంచాయతీ నిధులను దొంగిలించి, దారి మళ్లించిన అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి బాధ్యులైన అధికారులను కఠినంగా శిక్షించాలని, రూ.8,629 కోట్లు తిరిగి పంచాయతీలకు జమ చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ కడలి గోపాలరావు ప్రభుత్వానికి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు విన్నవించారు. నాలుగేళ్ళ నుంచి రాష్ట్రంలో 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం 14,15వ ఆర్థిక సంఘాల ద్వారా, ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీలకు వేలకోట్లు నిధులు పంపితే ఆ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్ళించింది. పంచాయతీలకు జమ చేయాలని చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు యలమంచలి బాబురాజేంద్రప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘాల ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేశామని పేర్కొన్నారు. పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన 14,15 ఆర్థికసంఘాల నిధులను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దారి మళ్ళించిన రూ.8,629 కోట్లు, ఉపాధిహామీ పథకానికి చెందిన వేలకోట్లు పంచాయతీలకు విడుదల చేసేలా మంత్రి పవన్‌కల్యాణ్‌కు పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్ సంఘాల రాష్ట్రకమిటీ నాయకులు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

వంద భాషల్లో భగవద్గీత గజల్స్ రూపకల్పన


గజల్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23 : భగవద్గీతను 'వంద భాషల్లో గజల్స్ రూపకల్పన' చేసేందుకు సంకల్పించినట్టు గజల్స్ వాయిద్యకారుడు గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వద్ద శనివారం రాత్రి తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాల సందర్భంగా గజల్స్ విద్వాంసుడు గజల్ శ్రీనివాస్‌కు 'గజల్ సామ్రాట్ అవార్డు' ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు సాహితీ సమాఖ్య అధ్యక్షుడు మండా బ్రహ్మాజీ, ప్రధాన కార్యదర్శి పైలు శ్రీనివాస్, సినీగేయ రచయిత రసరాజు, బీవీఆర్ కళాకేంద్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో గ్రామాభివృద్ధి శూన్యం

వీరవాసరం (భీమవరంటౌన్), జూన్ 23 : గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే పులపర్తిరామాంజనేయులు అన్నారు. ఆదివారం వీరవాసరం మండలం పంజావేమవరం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గం అంతా తిరిగి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దేశానికి గ్రామాలు పట్టుగొమ్మలని అందుకే అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. సమస్యలు ఏమైనా ఉంటే తనదృష్టికి తీసుకువస్తే సత్వరమే పరిష్కరిస్తానని అన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు(చినబాబు), టీడీపీ ప్రధాన కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన జిల్లా కార్యదర్శి చనమల్ల చంద్రశేఖర్, వీరవాసరం ఎంపీపీ దుర్గాభవాని, ఇతర ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత ఆయన కేక్ కట్‌చేసి అభినందనలు తెలిపారు. అనంతరం నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు.



గోస్తనీలో పేరుకు పోయిన కిక్కిస జీవీ కెనాల్‌లో గుర్రపు డెక్క, తూడు నిండిన దృశ్యం

పంట కాల్వలు చెత్తమయం

» తాగు, సాగునీటికి తప్పని ఇబ్బందులు

» గోస్తనీలో పేరుకుపోయిన కిక్కిస.. పట్టించుకోని అధికారులు

పెనుమంట్ర, జూన్ 23 : ఆచంట నియోజకవర్గంలో ప్రధాన పంట కాల్వలైన జీవీ కెనాల్, బ్యాంకు కెనాల్, నర్సాపూర్ కెనాల్ వాటి ఉప కాల్వల సమీపంలో నివాసాలు అధికంగా ఉండడంతో చెత్తాచెదారం ఆయా కాల్వల్లో పారేస్తున్నారు. ఈ మేరకు పంట పొలాలకు నీటి ప్రవాహం అవరోధం ఏర్పడడంతో అన్నదాతలకు కన్నీరు తెప్పిస్తున్నాయి. జీవీ కెనాల్‌లో మాముడూరు బ్రిడ్జి వద్ద నుంచి వచ్చిన వ్యర్థాలు, తూడు పేరుకుపోవడంతో సాగునీరు ముందుకు కదలడం లేదు. బ్యాంకు కెనాల్, నరసాపురం కెనాల్ ప్రాంతాల్లో ఇళ్లు, పశువుల పాకలు గట్లపై వెలిశాయి. ఈ మేరకు చెత్తాచెదారం కాల్వలోనే వేయడం, మృతి చెందిన కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు, నీటి వాడకాలు, మరుగుదొడ్లు తూరలు కాల్వల్లోకి పెట్టడంతో దిగువ ప్రాంతాలకు తాగు, సాగునీరు అందించే కాల్వలు నీటి కాలుష్యానికి గురవుతున్నాయి.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

కాల్వల కలుషితంపై ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు కాల్వల్లో తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడంతో నీటి ప్రవాహనికి అడ్డంకిగా మారాయి. గత ఐదేళ్లగా ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో కాల్వ గట్లు పునరుద్ధరణ, ఉప కాల్వలకు వెళ్లే గేట్లు మరమ్మతులు వంటివి గాలికి వదిలేశారు.

బినామీ కాంట్రాక్టర్ల చేతివాటం !

గోస్తనీ నది తవ్వకాలలో బినామీ కాంట్రాక్టర్లు చేతివాటం ప్రదర్శించినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వ పాలనలో పెనుమంట్ర మండలం పెనుమంట్ర నుంచి సోమరాజు ఇల్లింద్రపర్రువరకు మూడు ప్యాకేజీల్లో గోస్తనీ నది తవ్వకాలు రూ. 4.20 లక్షలతో చేపట్టారు. తవ్వకాలు చేపట్టాల్సిన కాంట్రాక్టర్లను వైసీపీ నేతలు బెదిరించి అప్పటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అండదండలతో ఆయన అనుచరులే బినామీ కాంట్రాక్టర్లుగా అవతారమిచ్చారు. నిబంధనలు గాలికి వదిలేసి గోస్తనీ నదిలో పేరుకుపోయిన కిక్కిస, బురదను గట్లపైకి వేసి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి జేబులు నింపుకున్నారు. పనులు పర్యవేక్షించాల్సిన డ్రెయినేజీ అధికారులు పత్తాలేకుండా పోయారు.

చుక్ చుక్ బండి.. ఇలాగైతే ఎలాగండి !



నేటి నుంచి 26 రైళ్లు రద్దు

ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు రైళ్లు. అయితే సుమారు రెండేళ్లుగా రైళ్లు ఎక్కాలంటే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణంలో నరకం చూస్తున్నారు. ఎందుకంటే ఏ రైలు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో.. ఒకవేళ అదృష్టం బాగుండి వచ్చినా గమ్యానికి ఎప్పుడు చేరుస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నిర్వహణ పేరుతో దారి మళ్లించడం, తాత్కాలి కంగా రద్దు చేస్తుండడంతో రైలు ప్రయాణం అయోమయంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు రాజమండ్రి రైల్వే స్టేషను మీదుగా నడుస్తూ.. ప్రజాదరణ ఎక్కువగా కలిగిన 26 రైళ్లను ఏకంగా నెలన్నరపాటు రద్దు చేయడంతో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సీజనర్లు ఇబ్బందులు తప్పడం లేదు. ఏదేమైనా రైళ్లు గాడి తప్పడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

» ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
» నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
» సుదూరాల నుంచి వచ్చే రైళ్లే దిక్కు
» ఆ రైళ్లలో కాలు పెట్టలేని దుస్థితి
» ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
» కొత్త ఎంపీలు పట్టించుకోవాలని అభ్యర్థన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/ ఏలూరుఎడ్యుకేషన్ :

రైళ్ల రద్దుతో తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్, ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రయాణికులకు అగచాట్లే.. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించే వాళ్లకు మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు. సింహాద్రి రైలును తాత్కాలికంగా రద్దు చేస్తేనే జనాలు అల్లాడిపోతారు. అలాంటి పరిస్థితుల్లో రత్నాచల్, సర్కారు, జన్మభూమి, లింక్, తిరుపతి-కాకినాడ బళ్లను ఆపేయడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తారాస్థాయికి చేరే అవకాశం ఉంది. కారణాలేమైనా ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీలు నడపాలనే డిమాండ్ వినవస్తోంది. తమ అవస్థలపై కొత్తగా ఎన్నుకున్న ఎంపీ పురందేశ్వరి దృష్టి సారించాలని గోదారోళ్లు కోరుతున్నారు.

చుక్‌చుక్ బండి ఎందుకిలా..

రైల్వే చరిత్రలోనే 2023 జూన్ 2వ తేదీ దారుణమైన దుర్ఘటన. ఒడిశాలోని బాలాసోర్ వద్ద కోరమాండల్ మరో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 300 మందికిపైగా బలైపోయారు.దీంతో రైల్వే ఉలిక్కిపడింది. అత్యున్నత స్థాయిలో సమావేశాలు జరిగాయి. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని.. ట్రాక్, సిగ్నల్స్ వంటి కీలకమైన విభాగాలకు నిర్వహణకు తగు సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు ఆరంభించారు. వీటి కోసం రోలింగ్ బ్లాక్ కారిడార్ పేరుతో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. నాటి నుంచి మెయింటెనెన్స్ అని ట్రాక్‌పై రైళ్లను రద్దు చేస్తున్నారు.. .కానీ పనులు వేగంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

రైళ్లను రానుపోను తాత్కాలికంగా ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 26 నిలిపివేశారు రైలు నెం. 07466, 07467 (రాజమండ్రి-విశాఖ మెము), 17257, 17258 (కాకినాడ-విజయవాడ మెము), 17219, 17220 (మచిలీపట్నం-విశాఖ), 17249, 17250 (తిరుపతి-కాకినాడ), 17239, 17240(సింహాద్రి), 17243, 17244 (రాయగడ), 12861, 12862(లింక్ దక్షిణ్), 12717, 12718(రత్నాచల్), 12805, 12806 (జన్మభూమి), 17643, 17644 (సర్కారు), 22701, 22702(ఉదయ్), 12775, 12776 (కోకనాడ), 22707, 22708 (విశాఖ-తిరుపతి డబుల్ డెకర్) రైళ్లు 47 రోజుల పాటు రాకపోకలు సాగించవు. ఈ మేరకు ఫిబ్రవరి 19వ తేదీనే ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీఐ, టీఎఫ్‌టీఆర్, పీక్యూఆర్ఎస్ పనుల కోసం రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయం కోసం ఎంపీలను కలవనున్న 'ట్రైన్ మేట్స్'

ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా, కొండ నాలుకకు మందు వేయడానికి ఉన్న నాలుకను తీసివేసిన చందంగా రైల్వే అధికారుల తీరు ఉందని ప్రయాణికులు, సీజనర్లు మండిపడుతున్నారు. ఆధునికీకరణ-సాంకేతికతల జపంతో సామాన్యుల వాహనాలైన రైలుబళ్ళను రద్దుచేయడం సరైన విధానం కాదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిలో భాగంగా ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్ఎంలను కలుసుకుని, రద్దుచేసిన రైళ్లస్థానే విజయవాడ-రాజమండ్రి మధ్య నిత్యం ప్రయాణించే అన్నిశాఖల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, డైలీ సీజనర్లు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని ప్రత్యామ్నాయ రైలు ఒకటి నడపాలని వినతిపత్రాలను అందజేసి అభ్యర్థించాలని నిర్ణయించారు. ఆ మేరకు విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరంలకు రోజూ ఉదయం, సాయంత్రం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో రాకపోకలు సాగించేవారంతా 'ట్రైన్ మేట్స్'గా ఏర్పడి ఒక ఫార్మేట్‌లో సంతకాలు సేకరించి ఎంపీలు, రైల్వే ఉన్నతాధికారులకు ఇవ్వడానికి కార్యాచరణ చేపట్టారు. ప్రత్యామ్నాయాల్లో భాగంగా తెల్లవారుఝామున 3.15 గంటలకు బయలుదేరే 07768 విజయవాడ-రాజమండ్రి మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం ఐదు గంటలకు విజయవాడలో బయలుదేరే సమయంగా నిర్ణయించడంతోపాటు, విజయవాడ-విశాఖ రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఈ రూట్‌లో రాజమండ్రి వరకు మరో రైలుని నడిపాలని కోరుతున్నారు. ఈ ప్రత్యామ్నాయ చర్యలతోపాటు దూర ప్రాంతాలనుంచి వచ్చే కొన్ని రైళ్ళకైనా సాధారణ ప్రయాణికుల కోసం జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని అభ్యర్థిస్తున్నారు. రైళ్ళ రద్దు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పార్లమెంట్ సభ్యులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని 'ట్రైన్ మేట్స్' నాయకులు ఎండీ. జుల్ఫీకర్ అలీ, హలీమ్ కోరారు.

భక్తజనులతో శ్రీవారి క్షేత్రం కళకళ

ద్వారకాతిరుమల, జూన్ 23 : శ్రీవారి ఆలయం ఆదివారం భక్తజనులతో కళకళలాడింది. చిరుజల్లులు కురుస్తున్నా భక్తులు ఆలయానికి వచ్చి శ్రీవారిని అమ్మవార్లను దర్శించుకున్నారు. సెలవురోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 15 వేలమంది పైబడి యాత్రికులు వచ్చినట్టు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. వీరంతా ముందుగా ఆలయంలో మొక్కుబడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం శ్రీవారి వకుళమాత అన్నదాన భవనంలో అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

మోకాళ్లతో శ్రీవారి మెట్లెక్కిన టీడీపీ అభిమాని..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అంటే విపరీతమైన అభిమానం. అఖండ మెజారిటీతో కూటమి గెలిచి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని... తణుకు కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఎమ్మెల్యే కావాలని ఆపద మొక్కుల వాడికి మొక్కుకున్నాడు. అంతా అనుకున్నట్టు జరగడంతో ఆదివారం ఆ టీడీపీ వీరాభిమాని పసుపులేటి జైబాబు తన కుటుంబ సభ్యులతో శ్రీవారి క్షేత్రానికి వచ్చి తలనీలాలను స్వామికి సమర్పించాడు. అనంతరం ఒక చేతిలో ఆరిమిల్లి ఫొటో, మరో చేతిలో పార్టీ గుర్తును పట్టుకుని ఆలయ మెట్లను మోకాళ్లతో ఎక్కి ఆలయంలోకి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు జరుపుకున్నారు.


శ్రీవారి దర్శనార్థం క్యూలైన్‌లలో వెళ్తున్న భక్తులు


మోకాళ్లతో ఆలయ మెట్లు ఎక్కుతున్న టీడీపీ అభిమాని జైబాబు


తయారు చేసిన శివలింగాలను చూపుతున్న మహిళలు

శ్రీశైలం మల్లికార్జునస్వామి అభిషేకానికి..

» మట్టి శివలింగాల తయారీలో పాలకొల్లు మహిళలు

పాలకొల్లు అర్బన్, జూన్ 23 :స్థానిక పంచారామ క్షేత్రం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మట్టితో పార్థివ శివలింగాలను మహిళలు తయారు చేస్తున్నారు. రానున్న కార్తీక మాసంలో శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామికి కోటి శివలింగాలతో అభిషేకం చేయాలని పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండకు చెందిన ఓ భక్తుడు మొక్కుకున్నాడని, దానిలో భాగంతో తమ వంతుగా శివలింగాలను తయారు చేస్తున్నామబని మహిళలు తెలిపారు. సుమారుగా 70 ముద్రలను అందించారని వాటితో తాము ప్రతీ రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్వామివారి సన్నిధిలో సుమారు 40 మంది పాల్గొంటున్నామన్నారు. ఇప్పటి వరకు సుమారుగా 25 వేల శివలింగాలను తయారు చేశామన్నారు. పాలకొ ల్లు నుంచి సుమారు లక్ష శివలింగాలు తయారు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ లింగాలను శ్రీశైలం ఆలయంలో అభిషేకాలు చేసిన అనంతరం నిమజ్జనం చేస్తారని తమతో పాటుగా 24వ వార్డులోని శంభేశ్వర స్వామి ఆలయంలోనూ మహిళలు శివలింగాలను తయారు చేస్తున్నట్టు తెలిపారు. తయారైన శివలింగాలను చిన్న చిన్న అట్టపెట్టెల్లో భద్రపరుస్తున్నట్టు తెలిపారు.

వచ్చే నెల 7 నుంచి జగన్నాథుని రథోత్సవాలు


పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్రా బలభద్ర జగన్నాథ విగ్రహాలు

ద్వారకాతిరుమల, జూన్ 23: శతాబ్దకాలం నాటి పురాతన చరిత్ర కలిగిన లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో జూలై 7 నుంచి 17 వరకు జగన్నాథుని రథోత్సవాలు జరుగనున్నట్లు ఆలయ ఈవో వి.త్రినాథరావు తెలిపారు. ప్రతి ఏటా ఈ ఉత్సవాలను పూరీ క్షేత్రంలో మాదిరిగా ఇక్కడ శ్రీవారి దేవస్థానం వైభవంగా నిర్వమిస్తుంది. ఈ క్రమంలో పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథదారు విగ్రహాలు ఉత్సవక్రతు వులో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా వచ్చే నెల ఏడో తేదీన రథవాహనంపై స్వామివారు లక్ష్మీపురం ఆలయం నుంచి సాయంత్రం ఐదు గంటలకు శ్రీవారి క్షేత్రానికి ఊరేగింపుగా వస్తారు. ఉత్సవాల ముగింపు రోజైన 17న ఆలయం నుంచి సమీప గ్రామమైన తిమ్మాపురానికి సాయంత్రం ఐదు గంటలకు రథయాత్రగా వెళ్లనున్నారు. ఈ ఉత్సవాలను దర్శించి భక్తులు తరించాలని ఈవో కోరారు.

సీటీజీఈవోఏ కార్యవర్గం ఎన్నిక



విజయవాడ, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ పరిధిలో ఐదు జిల్లాల పరిధిలో సెంట్రల్ టాక్స్ గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉండే ఈ కార్యవర్గం అధ్యక్షుడిగా బి.నవీన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కె.యుగంధర్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఈశ్వరరావు, బి.సుకుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, సీహెచ్ కన్నారావు ఎన్నికవ్వగా, కోశాధికారిగా మిక్కిలినేని శ్రీనివాస్, లైజనింగ్ కార్యదర్శిగా టీవీజీకే మూర్తి, జేసీఎం సభ్యురాలిగా బి.శ్రీలక్ష్మి మెంటార్‌గా ఎం.నాగరాజు ఎన్నికయ్యారు.



మంత్రి నిమ్మల, ఎమ్మెల్యే పితానిని కలసిన డాక్టర్ శ్రీనివాస్

మంత్రి నిమ్మలను కలసిన మార్టేరు ఏడీఆర్ శ్రీనివాస్

పాలకొల్లు రూరల్/పెనుమంట్ర జూన్ 23 :మార్టేరు వరి పరిశోధాన స్థానం విశిష్టతను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయు డుకు వరి పరిశోధాన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి. శ్రీనివాస్ తెలిపారు, ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి వరిపరిశోధాన స్థానం విశిష్ట తను తెలిపి, ఒకసారి సందర్శించాలని కోరారు. ఈ సందర్భంగా 2022లో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విడుదలైన వరి వంగడాలు రైతులకు ఉపయోగ పడుతున్నాయని తెలిపారు. స్వర్ణ రకంగా పేరొందిన ఎంటీయూ 1318 విత్తనాలను ప్రదర్శించి వాటి గుణగణాలను మంత్రికి తెలిపారు.

పితానిని కలసిన మార్టేరు ఏడీఆర్

ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మార్టేరు వ్యవసాయ పరిశోధన సంచాలకుడు టి.శ్రీనివాస్ ఆదివారం పోడూరు మండలం కొమ్ము చిక్కాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణకు ఎంటీయూ 1318 వరి రకంపై వివరించారు. కాలపరిమితిలో చీడపీడల తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చిన స్వర్ణ రకం అని తెలిపారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 23 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో ఏలూరు జిల్లాలో ఉన్న పోలీసులు శనివారం అర్థరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. రాత్రి వేళ రోడ్డు ప్రమాదాలు జరుగకుండా వాహన డ్రైవర్లకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, లాడ్జీలలో అనుమానాస్పదంగా ఉన్న వారిని ప్రశ్నించారు. ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎంల వద్ద ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలు జరుగకుండా ముందస్తుగా రాత్రిపూట ఆ ప్రాంతాలను తనిఖీలు చేశారు. గంజాయి, నాటుసారా, అక్రమ మద్యం రవాణా జరుగకుండా జాతీయ, రాష్ట్రీయ రహదారులపై విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు.

హెడ్ కానిస్టేబుల్ వ్యాఖ్యలపై విచారణ..?

భీమవరం క్రైం, జూన్ 23 : భీమవరం పట్టణంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ కొన్ని సామాజిక వర్గాలపై వ్యాఖ్యలు చేస్తూ వీడియో విడుదల చేశారు. అవి సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టినట్టు సమాచారం.

కైకరంలో ఉద్రిక్తత

ఉంగుటూరు, జూన్ 23 : ఉంగుటూరు మండలం కైకరం గ్రామంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైసీపీ నాయకుడు పుప్పాల గోపి ఇంటి వద్ద తాను లేని సమయంలో తన ఇంటికి పలువురు వచ్చి సీసీ కేమేరాలు, కారు అద్దాలు పగలగొట్టారని వాపోయారు. అదేవిధంగా ఆర్యవైశ్య నాయకుడు కోనా శ్రీనివాసరావు ఇంటికి కొందరు గుంపుగా వెళ్లి దౌర్జన్యం చేయడంతో అక్కడ కూడా ఉద్రిక్తత నెలకొంది. పలువురు యువకులు మద్యం తాగి దాడులు చేసినట్టు చెబుతున్నారు. చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ పరిస్థితులను అంచనా వేసి ఎటువంటి గొడవలు లేకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ఫ్లెక్సీ వివాదమే దీనికి కారణమని పలువురు భావిస్తున్నారు.

క్రైం సమాచారం


ఏలూరు కాల్వలో గాలింపు చర్యలు చేపడుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) మణికంఠ (ఫైల్)

కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి బాలుడి గల్లంతు

» గాలింపు చర్యలు చేపట్టిన అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23 : కాళ్లు కడుక్కునేందుకు వెళ్లిన బాలుడు కాలు జారి ఏలూరు కాల్వలో గల్లంతైన ఘటన ఆదివారం తాడేపల్లిగూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. పడాలకు చెందిన వానపల్లి మణికంఠ తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. సైకిల్‌కు ప్యాచ్ పడడంతో వేయించేందుకు యాగర్లపల్లి వంతెన సమీపంలో సైకిల్ ఇచ్చి కాళ్లకు మట్టి అయిందని కాళ్లు కడుక్కునేందుకు కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తు జారిపోయాడు. స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు. కాల్వలో వడి ఎక్కువ ఉండడంతో చాలా సేపు ప్రయత్నించి నిలుపుదల చేశారు. ఈ మేరకు కేసు చేమోదు చేశామని సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మణికంఠ తండ్రి సూరిబాబుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు గల్లంతు కావడంతో ఆ కాల్వ గట్టునే కన్నీటిపర్యంతమయ్యాడు.

ఆలయానికి వెళితే.. ఇల్లు దోచేశారు

» 11 కాసుల బంగారం, నగదు తస్కరణ

జంగారెడ్డిగూడెం, జూన్ 23 : పట్టణంలోని సూరపరాజు కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తుతెలియని దుండగులు విలువైన వస్తువులు దొంగిలించిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక సూరపరాజు కాలనీకి చెందిన బోగిరెడ్డి చంద్రయ్య తన కుటుంబంతో కలసి అహోబిలం ఆలయానికి ఈనెల 21న వెళ్లారు. ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడంతో పక్క పోర్షన్‌లో అద్దెకు ఉండే వారు చంద్రయ్యకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. సత్వరమే 22వ తేదీ రాత్రి ఇంటికి చేరుకుని చూడగా బీరువా పగులగొట్టి అందులోని 11 కాసుల బంగారు వస్తువులు, కొంత నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆదివారం ఉదయం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహిళ అరెస్ట్

» రూ.3.56 లక్షల విలువైన బంగారు ఆభరణాలు రికవరీ


చోరీ వివరాలు వెల్లడిస్తున్న రైల్వే పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 23: రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న మహిళను రైల్వే పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ జి. శ్రీహరిబాబు తెలిపారు. ఆదివారం తాడేపల్లిగూడెంలో ఎస్ఐ చోరీ వివరాలు వెల్లడించారు. రైళ్లలో చోరీలు జరుగుతున్నాయని రైల్వే పోలిసులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేపట్టగా తాడేపల్లిగూడెం నుంచి నిడదవోలు వెళ్లే రూట్‌లో చోరీలకు పాల్పడుతున్న నరసాపురం పట్టణానికి చెందిన యామన నందినిదేవిని అదుపులోకి తీసుకున్నామన్నారు. భీమవరం, తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లలో నమోదైన రూ.3.56 లక్షల విలువ చేసే 113 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ సొత్తును రికవరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఇంటిముందు పార్క్ చేసిన బైక్ చోరీ

ఏలూరు క్రైం, జూన్ 23 : రాత్రివేళ ఇంటి ముందు పార్కు చేసిన కేటీఎం బైక్‌ను గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏలూరు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడుకు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ తన కేటీఎం బైక్‌ను తన ఇంటి ముందు ఉంచి తాళాలు వేశారు. తెల్లవారేసరికి ఆ బైక్ కనిపించలేదు. ఈమేరకు ఏలూరు త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

దుర్భాషలాడిన వైసీపీ నాయకులపై కేసు

జంగారెడ్డిగూడెం, జూన్ 23 :జనసేన నాయకులు, కార్యకర్తలను పరుష పదజాలంతో దుర్భాషలాడారని వైసీపీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని లక్కవరం ఎస్ఐ సుధీర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం లక్కవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. పుట్లగట్లగూడెంలో ఈనెల 19న వైసీపీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తన తల్లి పేరుతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకర్‌పై ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను జనసేన నాయకులు కావాలని చింపేశారని ఆరోపిస్తూ అదే గ్రామానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలను దుర్భాషలాడి దూషించారని జనసేన నాయకుడు కాటిచర్ల మణికంఠస్వామి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వామిశెట్టి హరిబాబు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

గంగానమ్మ సంబరం.. ఎమ్మెల్యే చంటి పూజలు


గంగానమ్మ సంబరంలో ఎమ్మెల్యే చంటి

ఏలూరు కార్పొరేషన్, జూన్ 23: మార్కండేయస్వామి ఆలయం వద్ద గంగానమ్మ సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాజా భజంత్రీల నడుమ సంబరాలు జరిగాయి. అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జనసేన నాయకుడు రెడ్డి అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఈ సందర్భంగా చంటిని, నాయుడుని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

లక్ష్మీనగర్ సమస్యలు పరిష్కరిస్తా

ఏలూరు టూటౌన్, జూన్ 23: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు లక్ష్మీనగర్‌లో సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తంగెళ్ళమూడి లక్ష్మీనగర్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీనగర్‌లో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తామన్నారు. రామయ్యకోనేరును అభివృద్ధి చేస్తామన్నారు. కాలనీలో లైట్లు వేసి వెలుగులు నింపుతామని అన్నారు. అనంతరం విద్యార్థులకు రాజ్యాంగ ప్రతులు, నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఏసుపాదం, కప్పా సత్యనారాయణ, గొర్లపల్లి మురళి, వారా సాల్మన్‌రాజు, రవికుమార్, జుంజు మోజేష్, తంగిరాల సురేష్‌బాబు, రెడ్డి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తాం

రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు దంపతులతో పాటు డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు బడేటి చంటిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకునేందుకు కృషి చేయాలని మేయర్ నూర్జహాన్‌కు సూచించారు. అనంతరం కార్పొరేటర్లు, మేయర్ దంపతులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, చోడే వెంకటరత్నం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎమ్మెల్యే రోషన్


జంగారెడ్డిగూడెం హైస్కూల్‌లో ఎమ్మెల్యే రోషన్

జంగారెడ్డిగూడెం, జూన్ 23: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆదివారం ఎమ్మెల్యే ఆదివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల వివరాలు హెచ్ఎం కెఎస్‌వి లోవకుమారిని అడిగి తెలుసుకున్నారు. డ్రాపవుట్స్ లేకుండా చూడాలని సూచించారు. బడి బయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ముత్తారెడ్డి, రావూరి కృష్ణ, తూటిగుంట దుర్గారావు, ఉపాధ్యాయులు ఎం.విజయప్రకాష్, సుధాకర్ రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్మాణం వేగవంతం చేయాలి


మంత్రి నిమ్మలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నేతలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 23: పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు కోరారు. పాలకొల్లులోని రామానాయుడు కార్యాలయంలో అప్పలనాయుడు, తదితరులు ఆదివారం కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నేతలు ఒబిలిశెట్టి శ్రావణకుమార్‌గుప్త, నగిరెడ్డి కాశీ నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యం : చింతమనేని


చింతమనేనిని అభినందిస్తున్న ఆటో వర్కర్స్

పెదవేగి, జూన్ 23: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆదివారం చింతమనేనిని కలసి గ్రామాల్లో సమస్యలపై విన్నవించారు. ఆటో యూనియన్ నాయకులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామాల్లో అంధకారం తొలగుతుందని, భయానక వాతావరణంలో గడిపిన ప్రజలు ఇక స్వేచ్ఛాయుత జీవనాన్ని అనుభవిస్తారని ఆయన తెలిపారు. ఆటో యూనియన్ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ప్రభాకర్ హామీ ఇచ్చారు.

● ఏలూరు కార్పొరేషన్: కలసి పనిచేసి అభివృద్ధి సాధిద్దామని జనసేన నేత రెడ్డి అప్పలనాయుడు అన్నారు. దుగ్గిరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతమనేని ప్రభాకర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, ఒబిలిశెట్టి శ్రావణగుప్త, రవి తదితరులు ఉన్నారు.

ఆదివాసీల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే బాలరాజును సత్కరిస్తున్న ఆదివాసీ నేతలు

జీలుగుమిల్లి, జూన్ 23: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజును ఆదివాసీ జెఏసీ సభ్యులు కలసి సత్కరించారు. ఆదివాసీయుల సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పాలన్నారు. జీవో నెం.3 స్థానంలో షెడ్యూల్ ప్రాంత ఉద్యోగుల చట్టం అమలు చెయ్యాలని జిల్లా అధ్యక్షుడు మొడియం శ్రీనివాసరావు కోరారు. జెఏసీ కమిటీ ఆధ్వర్యంలో టీఏసీ భవన్ ఏర్పాటుకు కృషి చెయ్యాలన్నారు. మెగా డీఎస్సీలో న్యాయం చెయ్యాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తమ సమస్యల్ని తీసుకెళ్లాలన్నారు. సోదెం రాజు, కొవ్వాసి శ్రీనివాసరావు, కుర్సం దుర్గారావు, మొడియం ప్రసాద్, పండు భాస్కర్ ఉన్నారు.

జనసేన పార్టీలో చేరిన పూళ్ళ సర్పంచ్


ఎమ్మెల్యే ధర్మరాజును కలసిన సర్పంచ్

ఉంగుటూరు, జూన్ 23: పూళ్ళ సర్పంచ్ దాయం సుజాత, ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి హరి బ్రహ్మ నాయుడు తదితరులు ఆదివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. పవన్ కల్యాణ్ ఆశయాలు నచ్చి పార్టీలో చేరినట్లు సర్పంచ్ సుజాత, ఆమె భర్త ప్రసాద్ అన్నారు. ఉప సర్పంచ్ హరి బ్రహ్మనాయుడు కూడా పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే ఆహ్వానించారు. వట్టి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాపులకు సంక్షేమ పథకాలు అందించాలి

చింతలపూడి, జూన్ 23: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులస్థులకు సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కాపు జేఏసీ నేతలు కోరారు. మంగళగిరిలో కలసి చంద్రబాబును కలసి విజ్ఞప్తి చేశామని కాపు సేవా సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆదిసత్యనారాయణ తెలిపారు. రాజకీయేతర కాపు సంఘాలు జేఏసీగా ఏర్పడి ముఖ్యమంత్రిని కలసినట్లు తెలిపారు.

ముస్లిం కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తేవాలి


మంత్రి లోకేశ్‌తో గఫార్‌ఖాన్

నిడమర్రు జూన్ 23 : నిర్వీర్యమైన ముస్లిం కార్పొరేషన్‌కు పూర్వవైభవం తేవాలని తెలుగు యువత జిల్లా కార్యదర్శి మహమ్మద్ గఫార్ ఖాన్ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. మండలంలోని పలువులు ముస్లిం పెద్దలు మంగళగిరిలో మంత్రి లోకేశ్‌ను కలసి సమస్యలు వివరించారు. మైనారిటీలకు టీడీపీ ప్రభుత్వం భరోసాగా ఉంటుందని హామీ ఇచ్చారు. లోకేశ్‌ను కలసిన వారిలో యండి జాకీర్, ఖాదిర్, యండి ఫరీద్, యండి ఖరీం ఖాన్ ఉన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

ఏలూరు రూరల్, జూన్ 23: భద్రాచలం బంధువుల ఇంటికి వెళ్లిన మాదేపల్లి హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి అంగులూరి కార్తీక్ గోదావరి నదిలో పడి మృతి చెందాడు. విద్యార్థి మృతదేహాన్ని ఆదివారం మాదేపల్లి ఇందిరా కాలనీకి తీసుకువచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్తీక్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి సంతాపం వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు సంతాపం తెలిపారు. పిల్లలను చెరువులు, నదులు, కాలువల చెంతకు వెళ్లనీయరాదని సూచించారు. విద్యార్థి మృతి చాలా బాధాకరమన్నారు.

చేపలకు డబ్బా మేత


చేపల చెరువులో మేత ఉంచిన డబ్బాలు



ఆక్వా సాగు విస్తీర్ణం రోజు రోజుకూ పెరుగుతోంది. సాగులో రైతులు నూతన పోకడలతో ముందుకు సాగుతున్నారు. చేపల చెరువులో రోజూ నిర్ణీత మయానికి క్రమం తప్పకుండా కూలీలు పడవపై కలియతిరుగుతూ మేత వేసేవారు. లేదా చేపల చెరువు మధ్యలో పాతి ఉంచిన కర్రలకు మేత సంచులను కట్టేవారు. చేపలకు మేత వేసేందుకు కూలీలు పలుమార్లు చెరువులోకి వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఖాళీ మేత డబ్బాలను ఉపయోగించి చేపలకు మేత అందుబాటులో ఉంచుతున్నారు. పదులు, వందల ఎకరాల్లో వున్న చేపల చెరువుల్లో ఖాళీ మేత డబ్బాలను ఒక క్రమపద్ధతిలో కట్టి ఉంచుతారు. వాటిలో ఉదయం లేదా సాయంత్రం నిర్ణీత వేళల్లో మేత ఉంచుతారు. చేపలు మేత తినేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తారు. దీనితో కూలీల సంఖ్య తగ్గడంతో పాటు పెట్టుబడి తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. మేత వేయడంతో డబ్బాలు నీటిలో మునిగి ఉంటాయి. చేపలు మేత తినేస్తే డబ్బాలు పైకి తేలుతున్నాయి. చేపల చెరువు మధ్యలో వరుసగా కనిపిస్తున్న చేపల మేత డబ్బాలు అటుగా వెళ్లే చూపరులను ఆకట్టుకుంటున్నాయి. - పెదపాడు

భారీ వర్షం


పోలవరం మెయిన్ బజార్‌లో కురిసిన వర్షం


ఉంగుటూరులో జలమయమైన పల్లపు ప్రాంతం


పి.రాజవరం వద్ద భూముల్లో చేరిన వర్షం నీరు

పోలవరం, జూన్ 23 : పోలవరం మండలంలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. స్థానిక మెయిన్ బజార్, బీసీ కాలనీ, కొత్తపేట కాలనీ, బెస్తావీధి, బాపూజీ కాలనీలలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా కావడంతో వీధులు రోడ్లు జలమయమయ్యాయి. పోలవరం నుంచి ఇటుకల కోట మీదుగా గుంజవరం రోడ్డులో భారీ గోతులు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. గూటాల, కొత్తపట్టిసీమ, పట్టిసీమ, వింజరం, చేగొండపల్లి, ఎల్ఎన్‌డీపేట, జిల్లెల్లగూడెం, కొంద్రుకోట పునరావాస కాలనీలలో పలు చోట్ల వర్షపు నీరు నిలిచి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు.

● చింతలపూడి: మండలంలో తెల్లవారుజామున భారీ వర్షం పడింది. సుమారు 3 గంటలకు పైగా పడిన వర్షంతో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. ఇప్పటికే భూములు దుక్కి దున్ని సాగుకు సిద్ధం చేసుకోగా, నారుమడులు పోస్తున్నారు. మండలంలో సుమారు 17వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. గొట్టపు బావుల కింద ఇప్పటికే నారుపోయగా, వర్షాధార చెరువుల కింద నారుమళ్ళు పోసుకోవడం ప్రారంభించారు.

● ఉంగుటూరు: మండలంలో రెండు రోజుల నుంచి భారీ వర్షాలు పడుతున్నాయి. రాత్రి వేళల్లో ఏకధాటి వర్షంతో వరి సాగుకు దుక్కులు వేగవంతమవుతున్నాయి. శుక్రవారం రాత్రి 42.2 మి.మీ., శనివారం రాత్రి 50.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మెట్ట ప్రాంతంలో పెద్ద ఎత్తున దుక్కులు నిర్వహిస్తున్నారు. మండలంలోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో డ్రెయినేజీలు సక్రమంగా లేకపోవడంతో నీరు నిలిచిపోయి దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● జీలుగుమిల్లి: మెట్ట ప్రాంతంలో ఆదివారం కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. జీలుగుమిల్లి, వంకవారిగూడెం, పి.రాజవరం గ్రామాల్లో పలు చోట్ల మడుల్లో వర్షం నీరు నిలిచింది. దీంతో వరి నారుమడులు సిద్ధం చేసేందుకు రైతులు దుక్కి చేస్తున్నారు. కామయ్యపాలెం, వంకవారిగూడెం వాగులు ఉదయం కొద్దిసేపు పొంగి రోడ్డు పైనుంచి ప్రవహించాయి.

ఖాతాదారులకు మెరుగైన సేవలు


మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు రూరల్, జూన్ 23: ఏలూరు కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టెకూ బ్యాంక్) ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తామని బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ అన్నారు. వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఆదివారం జరిగిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నివేదికను వెల్లడించారు. 10శాతం డివిడెండ్‌ను ప్రకటించారు. టెకూ బ్యాంక్ యాప్ రూపొందించామని, దీనిద్వారా లావాదేవీలను వేగవంతంగా నిర్వహించుకోవచ్చన్నారు. జిల్లాలో మరో బ్రాంచ్ ఏర్పాటు చేసేందుకు స్థలం కోసం పరిశీలన చేస్తున్నామన్నారు. సీఈవో ఎం.అచ్యుతరావు, డైరెక్టర్లు పి.నాగభూషణరావు, వి.మారుతీవర ప్రసాద్, రమేష్‌బాబు, ఆంజనేయస్వామి, షేక్ సాబీర్ హుస్సేన్, సోమేశ్వర రావు, వీవీ.రామారావు, డి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

వేలేరుపాడు, జూన్ 23: పోలవరం ప్రాజెక్టు ముంపు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా, జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కే.గౌస్ ఆరోపించారు. పడమరమెట్టగూడెంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంపు గ్రామాల్లో నిర్వాసితులకు కుటుంబపరమైన ఆర్అండ్ఆర్ పరిహారం, నివాస గృహాలకు నష్టపరిహారాన్ని చెల్లించకపోవడం దారుణమన్నారు. కొంతమంది నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో గృహాలు కేటాయించినప్పటికి కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. భూమికి భూమి ఇచ్చిన గిరిజనులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వకపోవడంతో వివాదాలు చెలరేగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం నిర్వాసితులను పూర్తిగా నిర్లక్ష్యం చేసి పరిహారం చెల్లించకుండా నిర్వాసితులకు అన్యాయం చేసిందని, నిర్వాసితులకు పూర్తి న్యాయం జరిగేలా ఎన్‌డీఏ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ నాయకులు ముత్యాలరావు, రవి, దానమయ్య, అనూష, నాళ్ళవరం ఎంపీటీసీ కే.రత్తమ్మ, తిరుమలపురం సర్పంచ్ చోడే విజయ, ఉపసర్పంచ్‌లు కత్తిబాబు, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా హామీలు అమలు చేయాలి

నిడమర్రు జూన్ 23: విభజిత ఆంధ్రప్రదేశ్‌కు లోక్‌సభలో ఇచ్చిన హామీలైన ప్రత్యేక హోదా అమలు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో రమణారావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరి, నిరంకుశ పాలన వల్ల కార్మిక, కర్షకులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక హోదా కోసం కేంద్రంతో పోరాటం చేసి సాధించాలన్నారు. వెలగలేటి మోహన్, కంచం వరప్రసాద్, కానూరురాజు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

విజ్ఞాన భాండాగారం గ్రంథాలయం

పెదవేగి, జూన్ 23: గ్రంథాలయం విజ్ఞాన భాండాగారమని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. పలువురు విద్యార్థులు గ్రంథపఠనం చేశారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథ పఠనం విద్యార్థి ఉన్నతికి దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథాలయానికి వెళ్లాలని ఆయన సూచించారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ బడులకే పరిమితం చేయాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 23: ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింప చేయడం ద్వారా ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరచడమేనని ఐక్య ఉపాధ్యాయ వేదిక (యూటీఎఫ్) చైర్మన్ వి.రాజశేఖర రెడ్డి, కన్వీనర్ ఆర్.వి.వి.ఎం.శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ పథకాల నగదు సాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు తరలిపోవడాన్ని ప్రభుత్వం గమనించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రమే ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రైవేటు విద్యా సంస్థలకు కూడా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తే ప్రస్తుతం పనిచేస్తున్న టీచర్లు మిగులు (సర్‌ప్లస్)గా అవుతారని, జీవో 117 ఉత్తర్వులను రద్దుచేసినా ఉపయోగం కూడా ఉండబోదన్నారు. మెగా డీఎస్సీ మాట ఎలావున్నా ఇపుడున్న ఉపాధ్యాయులే ఖాళీ అయిపోతారన్న వాస్తవాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని అభ్యర్థించారు. పేద విద్యార్థులకు, నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయంచేసేవిదంగా ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.


ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

76 మంది డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

ఉంగుటూరు, జూన్ 23: నారాయణపురం డిగ్రీ కళాశాలలో 76 విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జాబ్‌మేళాలో 183 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా ఆదివారం ఎంపిక నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.కే. విశ్వేశ్వరరావు, సెట్‌వెల్ సీఈవో మహరాజ్, ఒకేషనల్ ఆఫీసర్ వరలక్ష్మి, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.


పోతునూరు పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పోతునూరులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

దెందులూరు, జూన్ 23: పాఠశాలలో కలసి చదువుకున్న విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టారు. మండలంలోని పోతునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 1993లో పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులు గద్దే అమరేశ్వరావు, ఆడారి దుర్గా అప్పారావు, వెన్న రాజా రమేష్, బెజవాడ శివకుమారి, చమలమూడి ఆనందకుమారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు నున్న లక్ష్మణ్ బాబు, అత్యం నాగేశ్వరావు, నాగనబోయిన శంకర్‌రావు, పిల్లా అప్పారావు, ఆవుల వెంకటేశ్వరావు, పెద్దిరాజు, పరమేశ్వరరావు, వేణు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి జూన్ 23: రాట్నాలకుంట రాట్నాలమ్మకు భక్తులు ఆదివారం విశేష పూజలు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణశర్మ, రుద్రపాక శేషగిరిరావు, పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు చేశారు. పూజా టికెట్ల విక్రయాలద్వారా రూ.52,900, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.30 వేలు, ఫోటో విక్రయాల ద్వారా రూ.5495 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు రూ.14,527లను విరాళాలు అందించారని ఆయన చెప్పారు.

సింగన్నపల్లిలో ఘనంగా గంగానమ్మ జాతర


పసుపు నీళ్ల బిందెలతో మహిళలు

పోలవరం, జూన్ 23: పోలవరం ప్రాజెక్టు ఎగువ గిరిజన ప్రాంతాల గ్రామ దేవత గంగానమ్మ ఉత్సవాలను సింగన్నపల్లి పునరావాస గ్రామస్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సింగన్న పల్లి, కొత్తూరు గ్రామాల మధ్య ఉండే గ్రామ దేవత గంగానమ్మను పునరావాసాల తరలింపులో సింగన్నపల్లికి తరలించారు. శనివారం రాత్రి నుంచి గంగానమ్మ జాతర ప్రారంభించి మేళతాళాలు, తీన్‌మార్ వాయిద్యాలతో పసుపు నీళ్ళ బిందెలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. సోమ, మంగళవారాలు పలు కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

అభయాంజనేయుడికి ఎమ్మెల్యే ధర్మరాజు పూజలు

ఉంగుటూరు, జూన్ 23: స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో కూడా పూజలు చేశారు. అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధన నిర్వహించారు. వట్టి పవన్ కుమార్, సర్పంచ్ బండారు సింధు మధు, జనసైనికులు, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

అనంతరం నల్లమాడు శివారు రామచంద్రపురం నీలాలమ్మ జాతరలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు సింగులూరి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

వైద్య భగవానుడికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 23: పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రదిక్షణలు జరిపి అర్చకుల ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. ఆలయ అర్చకులు ఆదిశర్మ భక్తులతో పూజలు, సూర్యనమస్కార పూజలు జరిపించారు. తొలుత సూర్యనారాయణస్వామికి పంచామృతాభిషేకం జరిపి అనంతరం విశేష అలంకరణ చేసి ప్రత్యేక హారతులు ఇచ్చి ఆరాధించారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఆదివారం ఫ్లాష్ టీం ఆధ్వర్యంలో జయహో యోగా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి ప్రారంభించారు. ప్రతీ ఒక్కరూ యోగా చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. శ్రీనివాస్, నాగ విఘ్నేశ్వరరావు, మాధవరావు, కొమ్మా నాగరాజు, ఎస్.కె.సత్తార్, జంపా సూర్యనారాయణ, బొంతిన రామకృష్ణ, మేరీ మాణిక్యం పాల్గొన్నారు.
- **పోలవరం :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పి పోశిబాబు, ఉపాధ్యక్షుడిగా జీజీఆర్‌సీహెచ్ శేఖర్‌బాబు, కార్యదర్శిగా టి వెంకటేశ్వరరావు, ఎస్.నారాయణ, జాయింట్ సెక్రటరీ సిద్దా కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. సభ్యులుగా మద్దు పోశీనాగేశ్వరరావు, సొబ్బన మోహన్, ఎస్.వెంకట్రావు, ఎస్‌కె షెహినా బాషా ఎన్నికయ్యారు.
- **భీమడోలు :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం భీమడోలులో జరిగింది. ముఖ్య అతిధిగా కేంద్ర కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు, సమన్వయ కమిటీ చైర్మన్ కె సూర్యనారాయణ, డి ప్రభాకరరావు పాల్గొన్నారు. అధ్యక్షుడు గుడివాడ సీతారామాంజనేయులు, కార్యదర్శి అల్లాడ ప్రసాదరావు, కో శాధికారి జి శంకర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ దోకల పెద చిన్నారావు, నున్నం వెంకట రామకృష్ణ, బంటు గణేష్‌కుమార్, ఆదినారాయణ, రామిశెట్టిరామన్నను ఎన్నుకున్నారు.
- **జంగారెడ్డిగూడెం :** శ్రీనివాసపురం టీడీపీ అధ్యక్షుడు పోల్నాటి సత్యనారాయణకు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పెనుమర్తి రామ కుమార్, పోల్నాటి చినబాబు, బోడా శ్రీనివాసరావు, జొన్నకూటి శ్రీనివాసరావు, చల్లారావు, తదితరులు ఆయనను పరామర్శించారు.
- **టి.నరసాపురం :** కృష్ణాపురంలో గోర్ బంజారా హాథిరామ్ జయంతి భజరంగి భేరి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. జరభల చందానాయక్ మాట్లాడుతూ గొప్ప భక్తుడు హాథిరామ్ అన్నారు. విజయనగర రాజులు పెట్టిన భక్తి పరీక్షలో నెగ్గి, ఏడుకొండలపైన జీవ సమాధి అయ్యి, గోర్ బంజారాలకు భోగ్ భండారో భక్తి మార్గాన్ని చూపిన మహనీయుడు హాథిరామ్ అని ఆయన తెలిపారు. భూక్యా బీగనాథం నాయక్, భూక్యా సత్యంబాబు నాయక్, తదితరులు పాల్గొన్నారు.






బుట్టాయగూడెం, ఉంగుటూరు, భీమడోలులో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలి

బుట్టాయగూడెం, జూన్ 23: బీజేపీ మాతృ సంస్థ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ దేశంకోసం చేసిన త్యాగం మరువలేనిదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ అన్నారు. మండలంలోని నిమ్మలగూడెం, మెట్టగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం బలిదాన్ దివస్ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో చట్టాలు, రాజ్యాంగం ఒక్కటే ఉండాలని ముఖర్జీ గట్టిగా వాదించేవారన్నారు. ప్రతి బీజేపీ కార్యకర్త ఆయన ఆశయ సాధనకు పోరాడాలని, పార్టీ ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. నాయకులు వంకా కాంచనమాల, ధర్ముల వెంకటేశ్వరావు, సోము హరినారాయణ, ధర్ముల బాబురావు, జగపతి, ధర్ముల గంగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: ఒక దేశానికి రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధానులు ఉండకూడదని జాతి ఐక్యత, సమగ్రతకు తన ప్రాణాలను బలిదానం ఇచ్చిన శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలను బీజేపీ శ్రేణులు కొనియాడారు. బొమ్మిడి, కాకర్లమూడి, ఉంగుటూరు శక్తి కేంద్రాలలో శ్యాం ప్రసాద ముఖర్జీ బలి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, అడపా శోభారాణి, వంజరపు దుర్గారావు, రామారావు, కొప్పుల శ్రీను, అడపా గణపతి, కొరిపల్లి అప్పారావు, టేకి వెంకటేష్, కొండలరావు పాల్గొన్నారు.

● కుక్కునూరు: శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి వర్ధంతి సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి రాచమడుగు వరలక్ష్మి ఆయన సేవలను గుర్తుచేశారు. ఆర్టికల్ 370కి వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు నిరంజన్, కోశాధికారి వాడపల్లి లక్ష్మణాచార్యులు, సత్యనారాయణరాజు, సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

● భీమడోలు: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ సేవలు అభినందనీయమని ఆయన యువతకు స్ఫూర్తిదాయకులని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ అన్నారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌పటేల్ అధ్యక్షతన నివాళులర్పించారు. విక్రమ్‌కిశోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ విభజన, కాశ్మీర్ అంశాలపై చేసిన పోరాటాలను గుర్తు చేశారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. విజ్జు ధర్మారావు, ఎం.శ్రీనివాస శాస్త్రి, మూర్తి, వర్ధినీడి కపిరాజు తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని తుమ్మలపల్లి బ్రహ్మాజీరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు బుచ్చయ్య సిద్ధాంతి, శర్మ, రామారావు, కొనకళ్ళ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చుక్ చుక్ బండి..
ఇలాగైతే ఎలాగండి!



నేటి నుంచి 26 రైళ్లు రద్దు

ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు రైళ్లు. అయితే సుమారు రెండేళ్లుగా రైళ్లు ఎక్కాలంటే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణంలో నరకం చూస్తున్నారు. ఎందుకంటే ఏ రైలు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో.. ఒకవేళ అదృష్టం బాగుండి వచ్చినా గమ్యానికి ఎప్పుడు చేరుస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నిర్వహణ పేరుతో దారి మళ్లించడం, తాత్కాలి కంగా రద్దు చేస్తుండడంతో రైలు ప్రయాణం అయోమయంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు రాజమండ్రి రైల్వే స్టేషను మీదుగా నడుస్తూ.. ప్రజాదరణ ఎక్కువగా కలిగిన 26 రైళ్లను ఏకంగా నెలన్నరపాటు రద్దు చేయడంతో ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, సీజనర్లు ఇబ్బందులు తప్పడం లేదు. ఏదేమైనా రైళ్లు గాడి తప్పడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
- నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
- సుదూరాల నుంచి వచ్చే రైళ్లే దిక్కు
- ఆ రైళ్లలో కాలు పెట్టలేని దుస్థితి
- ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
- కొత్త ఎంపీలు పట్టించుకోవాలని అభ్యర్థన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)/ ఏలూరుఎడ్యుకేషన్ :

రైళ్ల రద్దుతో తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్, ఉమ్మడి పశ్చిమ జిల్లా ప్రయాణికులకు అగచాట్లే.. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించే వాళ్లకు మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు. సింహాద్రి రైలును తాత్కాలికంగా రద్దు చేస్తేనే జనాలు అల్లాడిపోతారు. అలాంటి పరిస్థితుల్లో రత్నాచల్, సర్కారు, జన్మభూమి, లింక్, తిరుపతి-కాకినాడ బళ్లను ఆపేయడం వల్ల ప్రయాణికుల ఇబ్బందులు తారస్థాయికి చేరే అవకాశం ఉంది. కారణాలేమైనా ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీలు నడపాలనే డిమాండ్ వినవస్తోంది. తమ అవస్థలపై కొత్తగా ఎన్నుకున్న ఎంపీ పురందేశ్వరి దృష్టి సారించాలని గోదారోళ్లు కోరుతున్నారు.

చుక్‌చుక్ బండి ఎందుకిలా..

రైల్వే చరిత్రలోనే 2023 జూన్ 2వ తేదీ దారుణమైన దుర్ఘటన. ఒడిశాలోని బాలాసోర్ వద్ద కోరమాండల్ మరో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 300 మందికిపైగా బలైపోయారు.దీంతో రైల్వే ఉలిక్కిపడింది. అత్యున్నత స్థాయిలో సమావేశాలు జరిగాయి. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని.. ట్రాక్, సిగ్నల్స్ వంటి కీలకమైన విభాగాలకు నిర్వహణకు తగు సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు ఆరంభించారు. వీటి కోసం రోలింగ్ బ్లాక్ కారిడార్ పేరుతో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. నాటి నుంచి మెయింటెనెన్స్ అని ట్రాక్‌పై రైళ్లను రద్దు చేస్తున్నారు.. .కానీ పనులు వేగంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

రైళ్లను రానుపోను తాత్కాలికంగా ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు 26 నిలిపివేశారు రైలు నెం. 07466, 07467 (రాజమండ్రి-విశాఖ మెము), 17257, 17258 (కాకినాడ-విజయవాడ మెము), 17219, 17220 (మచిలీపట్నం-విశాఖ), 17249, 17250 (తిరుపతి-కాకినాడ), 17239, 17240(సింహాద్రి), 17243, 17244 (రాయగడ), 12861, 12862(లింక్ దక్షిణ్), 12717, 12718(రత్నాచల్), 12805, 12806 (జన్మభూమి), 17643, 17644 (సర్కారు), 22701, 22702(ఉదయ్), 12775, 12776 (కోకనాడ), 22707, 22708 (విశాఖ-తిరుపతి డబుల్ డెకర్) రైళ్లు 47 రోజుల పాటు రాకపోకలు సాగించవు. ఈ మేరకు ఫిబ్రవరి 19వ తేదీనే ఆదేశాలు జారీ అయ్యాయి. బీసీఐ, టీఎఫ్‌టీఆర్, పీక్యూఆర్ఎస్ పనుల కోసం రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయం కోసం ఎంపీలను కలవనున్న 'ట్రైన్ మేట్స్'

ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా, కొండ నాలుకకు మందు వేయడానికి ఉన్న నాలుకను తీసివేసిన చందంగా రైల్వే అధికారుల తీరు ఉందని ప్రయాణికులు, సీజనర్లు మండిపడుతున్నారు. ఆధునికీకరణ-సాంకేతికతల జపంతో సామాన్యుల వాహనాలైన రైలుబళ్లను రద్దుచేయడం సరైన విధానం కాదని అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. దీనిలో భాగంగా ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పార్లమెంటు సభ్యులు, విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్ఎంలను కలుసుకుని, రద్దుచేసిన రైళ్లస్థానే విజయవాడ-రాజమండ్రి మధ్య నిత్యం ప్రయాణించే అన్నిశాఖల ఉద్యోగులు, ప్రైవేటు ఉద్యోగులు, విద్యార్థులు, డైలీ సీజనర్లు, వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలోపెట్టుకుని ప్రత్యామ్నాయ రైలు ఒకటి నడపాలని వినతిపత్రాలను అందజేసి అభ్యర్థించాలని నిర్ణయించారు. ఆ మేరకు విజయవాడ, నూజివీడు, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమహేంద్రవరంలకు రోజూ ఉదయం, సాయంత్రం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో రాకపోకలు సాగించేవారంతా 'ట్రైన్ మేట్స్'గా ఏర్పడి ఒక ఫార్మేట్‌లో సంతకాలు సేకరించి ఎంపీలు, రైల్వే ఉన్నతాధికారులకు ఇవ్వడానికి కార్యాచరణ చేపట్టారు. ప్రత్యామ్నాయాల్లో భాగంగా తెల్లవారుఝామున 3.15 గంటలకు బయలుదేరే 07768 విజయవాడ-రాజమండ్రి మెమూ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం ఐదు గంటలకు విజయవాడలో బయలుదేరే సమయంగా నిర్ణయించడంతోపాటు, విజయవాడ-విశాఖ రత్నాచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఈ రూట్‌లో రాజమండ్రి వరకు మరో రైలుని నడిపాలని కోరుతున్నారు. ఈ ప్రత్యామ్నాయ చర్యలతోపాటు దూర ప్రాంతాలనుంచి వచ్చే కొన్ని రైళ్లకైనా సాధారణ ప్రయాణికుల కోసం జనరల్ బోగీల సంఖ్యను పెంచాలని అభ్యర్థిస్తున్నారు. రైళ్ల రద్దు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పార్లమెంట్ సభ్యులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని 'ట్రైన్ మేట్స్' నాయకులు ఎండీ. జుల్ఫీకర్ అలీ, హలీమ్ కోరారు.

నూజివీడు డివిజన్‌లో భారీ వర్షపాతం

నూజివీడు టౌన్, జూన్ 23: నూజివీడు డివిజన్ వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం నమోదైంది. డివిజన్ వ్యాప్తంగా మొత్తం 195.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 32.5గా నమోదు అయింది. డివిజన్‌లో అత్యధికంగా చింతలపూడి మండలంలో 88.4 మిల్లీమీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా చాట్రాయి మండలంలో 10.8 మిల్లీమీటర్లు నమోదైంది. ఆగిరిపల్లిలో 14.6, ముసునూరులో 24.8, లింగపాలెంలో 28.6, నూజివీడు మండలంలో 32.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది.

నేటి నుంచి 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'

ముదినేపల్లి, జూన్ 23 : స్పందన కార్యక్రమం స్థానంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ప్రతి సోమవారం మండల స్థాయిలో అధికారులు ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్టు ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.లక్ష్మీ నరసకుమారి తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా నిలిపేసిన ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తున్నట్లు చెబుతూ మండల స్థాయిలో ప్రతి శాఖాధికారి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, మండల ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, జూన్ 23: పల్లెవాడ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున ఆ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె రామకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని పల్లెవాడ, చిన్నరామవరం, గోనెపాడు, భుజబలపట్నం, చటాకాయ్, నత్తగుల్లపాడు, కొల్లేరు గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైష్ణవికి సీఎం, ఎంపీల ప్రశంసలు


అంబుల వైష్ణవి

ముదినేపల్లి, జూన్ 23 : ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.25 లక్షల విరాళం ఇచ్చిన ముదినేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవిని శనివారం సాయంత్రం మంగళగిరిలో జరిగిన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. ఉండవల్లిలో చంద్రబాబుకు చెక్కు అందజేసిన అనంతరం ఆయన మంగళగిరి టీడీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ ఎంపీల సమావేశంలో వైష్ణవి విరాళం ఇచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ అమరావతి నిర్మాణానికి పొలం అమ్మి రూ.25 లక్షలు విరాళంగా ఇచ్చిన వైద్య విద్యార్థిని వైష్ణవికి ఉన్న శ్రద్ధ, బాధ్యత కూడా గత ప్రభుత్వానికి లేకుండా పోయిందని వ్యాఖ్యానించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ అంబుల వైష్ణవిని అభినందించారు. అమరావతి రాజధాని నిర్మాణానికి పొలం అమ్మి రూ.25 లక్షలు విరాళం ఇవ్వటం ఎంతో ఉదారత కలిగిన వారికే సాధ్యమవుతుందని ఆదివారం ఆయన ఫోన్‌లో వైష్ణవిని, ఆమె తండ్రి మనోజ్‌ను ప్రశంసించారు.

విద్యుత్ కోతలు విధించవద్దు

ముదినేపల్లి రూరల్, జూన్ 23: విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సొంటి నాగరాజు ప్రభుత్వానికి విన్నవించారు. ఎడాపెడా విద్యుత్ కోతలు విధించడంతో చిన్న పరిశ్రమల యజమానులు, షాపుల నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు.

'ఉపాధి'లో గుర్రపు డెక్క తొలగింపును చేర్చాలి

ముదినేపల్లి రూరల్, జూన్ 23: డ్రైన్‌లలో మేటవేసిన గుర్రపుడెక్క, తూడును ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహించాలని, డీసీ మాజీ అధ్యక్షుడు సుధాబత్తుల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద నిర్వహించే పనులలో తూడు, గుర్రపుడెక్క తొలగింపును చేర్చాలని, లేని పక్షంలో ప్రత్యేకంగా నిధులు విడుదల చేసి వాటి తొలగింపనకు ఆలస్యమవుతుందని, ఉపాధి కూలీలతో తక్షణం డెక్క తొలగింపు పనులు చేపట్టాలని కోరారు.

అక్రమంగా బుసక తవ్వితే చర్యలు

ముదినేపల్లి రూరల్, జూన్ 23: అనుమతులు లేకుండా బుసక తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్ కుమారి హెచ్చరించారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బుసక తవ్వకాలు జరిపినట్లు సమాచారం అందితే వీఆర్వోలే బాధ్యులని, వీఆర్వోలు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

అంటువ్యాధులు ప్రబలనివ్వద్దు

ముదినేపల్లి, జూన్ 23: అతిసార, డెంగీ, తదితర అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది తగిన పారిశుధ్య చర్యలు చేపట్టాలని ముదినేపల్లి మండల ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ మండలంలోని పంచాయతీల కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో సురక్షిత నీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకొకసారి శుభ్రం చేయాలని, రోడ్ల వెంబడి చెత్తాచెదారం వేయకుండా చూడాలని, నీటి పథకం పైపులైన్లు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మంచినీటి చెరువులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.


అన్నక్యాంటీన్లో పేదలకు భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కామినేని

పోలీసుల ఆర్థిక సాయంతో అన్న క్యాంటీన్

కైకలూరు, జూన్ 23: పేదల ఆకలి తీర్చేందుకు పోలీసులు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు తాలుకా సెంటర్లోని అన్న క్యాంటీన్లో పోలీసుల ఆర్థిక సాయంతో 500 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని దానాల్లో అన్నదానం మహోన్నతమైనదని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి పేద ప్రజలకు రూ.5లకే భోజనాన్ని అందించిందన్నారు. కైకలూరులో అన్న క్యాంటీన్ ఇకపై ప్రతి రోజు నిర్వహించడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టౌన్ సీఐ అకుల రఘు, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మి, కొత్తూరి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

మానవత కార్యవర్గం ప్రమాణ స్వీకారం

కైకలూరు, జూన్ 23: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వర రావు అన్నారు. ఆదివారం కైకలూరులో కైకలూరు నియోజకవర్గ మానవత స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. అధ్యక్షురాలిగా కొండ్రెడ్డి చిట్టెమ్మ, కార్యదర్శిగా మాడెం సత్యనారాయణ, కోశాధికారిగా ఇమ్మడి పాండురంగ విఠల్, ఉపాధ్యక్షుడిగా కాట్రగడ్డ అనిల్ కుమార్(నాని), సంయుక్త కార్యదర్శిగా నీలం కృష్ణవేణి, కార్యవర్గ సభ్యులుగా గంగుల వెంకట సీతారామాంజనేయులు, పిచుకల పవన్‌కాంత్, బూరుబోయిన మోహనరావు, ఎండీ గాలిబ్‌బాబు తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. సంస్థ మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, కోడూరి కనకదుర్గ, పి. రత్నాకరరావు, కడియాల కృష్ణారావు, ఎం. అజయబాబు, డాక్టర్ సుధాబత్తుల విజయకుమార్, వల్లూరిపల్లి సాయిసుధ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపైకే ముళ్ల చెట్లు!



కలిదిండి, జూన్ 23 : మండలంలోని మూల్లంక - మల్లంపూడి రహదారి వెంబడి ఇరువైపులా ముళ్లపొదలు ప్రమాద భరితంగా ఉన్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల కొమ్మలు రహదారిపైకి చొచ్చుకు రావటంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణీకుల కళ్లకు ముళ్ల కొమ్మలు తగిలి గాయపడుతున్నారు. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకోవటానికి వీలు లేక ట్రాఫిక్ స్తంభించిపోతోంది. రాత్రి వేళల్లో ముళ్ల పొదల నుంచి పాములు రహదారిపైకి రావటంతో భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో రహదారులకు మరమ్మతులు చేయకపోవటం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి దట్టంగా ఉన్న ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.


కాళ్లపాలెం రహదారిపై మురుగునీరు


జనార్దనవరంలో శిథిలమైన మెయిన్ రోడ్డు

చినుకు పడితే వణుకే!

- కాళ్లపాలెంలో రహదారిపైకే మురుగు
- జనార్దనవరంలో గోతుల్లో నిలిచిపోతున్న నీరు
- నరకం చూస్తున్న ప్రజలు
- మరమ్మతులకు వినతి

డ్రైనేజీ వ్యవస్థ లేక, రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజల పాట్లు అన్నీ ఇన్నీ కావు. వర్షాకాలం కావడంతో అభివృద్ధికి దూరంగా ఉన్న రహదారులపైనే నీరు నిలిచి ప్రజలు నరకం చూస్తున్నారు. డ్రైనేజీలు లేకపోవడంతో కలిదిండి మండలం కాళ్లపాలెంలో ఇళ్లలో వాడిన నీరు రోడ్లపైకే చేరుతోంది. ఇక వానలు కూడా పడడంతో నీరంతా రహదారిపైనే నిలుస్తోంది. నూజివీడు నియోజకవర్గం చాట్రాయి మండలం జనార్దనవరంలో అస్తవ్యస్త రోడ్లకు తోడు వానలు పడడంతో గోతుల్లో నీరు నిలిచి ప్రజల పాట్లు వర్ణనాతీతం.

కలిదిండి, జూన్ 23 : కాళ్లపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దీంతో కొద్దిపాటి వర్షానికే అంతర్గత రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళ్లపాలెం ప్రధాన రహదారికిరువైపులా డ్రైనేజీ లేక ఇళ్లలో వాడిన నీరు రహదారిపై నిల్వ ఉంటోంది. రహదారి పెద్ద గుంతలు పడటంతో రోజుల తరబడి మురుగు నీరు నిల్వ ఉండి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రహదారులపై వర్షపు నీటితోపాటు ఇళ్లలో వాడకపు నీరు రోడ్లపైనే ఉంటోంది. దీంతో దోమల బెడద అధికంగా ఉంటోందని వాపోతున్నారు. కాళ్లపాలెంలో డ్రైనేజీ ఏర్పాటు చేయాలని పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. రహదారిపై గుంతల్లో నీరు ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు, విద్యార్థులు గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలమైన రహదారితో..

చాట్రాయి: మండలంలోని జనార్దనవరం గ్రామంలో మెయిన్ రోడ్డు శిథిలావస్థకు చేరటంతో ప్రజలు, వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిత్తపూరు- బూరుగ్గూడెం రహదారి నుంచి తుమ్మగూడెం వైపు సుమారు 2 కిలోమీటర్లు దూరం రహదారి కంకర లేచిపోయి అధ్వానంగా తయారైంది. నిత్యం ఈ రహదారి మీదుగా తుమ్మగూడెం, సోమవరం, కొత్తగూడెం, యర్రావారిగూడెం తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. అధ్వాన రహదారిపై ప్రయాణించలేక వాహనచోదకులు నరకయాతనలు అనుభవిస్తున్నారు. వర్షం పడితే రహదారిపై గోతుల్లో నీరునిలిచి అపరిశుభ్రత నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రహదారికి తక్షణం మరమ్మతులు జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

సప్లై ఛానల్‌లో.. పూడికతీత పనులు ప్రారంభం

మంత్రి పార్థసారథి చొరవపై రైతుల హర్షం




గుడిపాడు సప్లై ఛానల్ పూడికతీత పనులను ప్రారంభిస్తున్న రైతులు (ఇన్‌సెట్) ఛానల్‌లో పూడికమట్టి తొలగింపు

ముసునూరు, జూన్ 23: లోపూడి తమ్మిలేరు నుంచి గుడిపాడు వరకు ఉన్న సప్లై ఛానల్ పూడికతీత పనులు నూజివీడు ఎమ్మెల్యే, రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో ఆదివారం ప్రారంభమయ్యాయి. జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను రైతులు దగ్గరుండి చేయిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు కొల్లి గంగారామ్, గద్దె రఘుబాబు, మండలపు శ్రీనివాసరావు, మేదరమేట్ల సురేంద్ర, ఎం.సోమేశ్వరరావు, వలసపల్లి రామ్మోహన్, ఊరకర్ణం కృష్ణయ్య తదితరులు మాట్లాడుతూ లోపూడి తమ్మిలేరు నుంచి గుడిపాడు, గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో ఉన్న 4 చెరువులకు నీరు వెళ్ళేందుకు 3.8 కిలోమీటర్ల పొడవుగల సప్లై ఛానల్‌కు మరమ్మతులను గత ప్రభుత్వం అరకొరగా చేయడం వల్ల ముళ్ళకంచెలు దట్టంగా పెరిగి, కాలువ పూడుకుపోయి నీరుపారే అవకాశం లేదని, ఈ ఏడాది కూడా చెరువుల్లో నీరువచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ చెరువుల ఆయకట్టు సుమారు 1300 ఎకరాలు ఉందని, గత ఏడాది చెరువుల్లో నీరులేక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయామన్నారు. అయితే ఈ సప్లై ఛానల్ పరిస్థితిని ఇటీవల మంత్రి పార్థసారథికి వివరించగా ఆయన వెంటనే సప్లై ఛానల్ మరమత్తులకు అంచనాలు తయారుచేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారని, ఇరిగేషన్ ఈఈ, డీఈలు ఈ 15న సప్లై ఛానల్‌ను పరిశీలించారని తెలిపారు. నిధులు మంజూరు ఆలస్యమయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌కు చెరువుల్లో నీరు వచ్చేలా చూడాలని మంత్రి పార్థసారథిని కోరగా ఆయన రెండు ఎక్స్‌కవేటర్లను పంపి కాలువ పూడికతీత పనులను ప్రారంభించారని రైతులు తెలిపారు. రైతుల సమస్యల పట్ల మంత్రి పార్థసారథి స్పందించిన తీరుపై మూడు గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు.



గోపవరంలో ఉచిత కంటి వైద్య శిబిరం

ముసునూరు, జూన్ 23: మండ లంలోని గోపవరంలో వాసన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 250 మందికి కంటిపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కళ్ళజోళ్ళు అందజేశారు. గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.


ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని


నూజివీడులో ముఖర్జీ చిత్రపటం వద్ద బీజేపీ నాయకుల నివాళి


వడ్లమానులో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

కైకలూరు, జూన్ 23: శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయాలు మహోన్నతమైనవని ఆయన స్థాపించిన జన సంఘ్ పార్టీ నేడు బీజేపీగా పేరొందిందని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని కైకలూరు ట్రావలర్స్ బంగ్లాలో ముఖర్జీ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతూ 1951లో భారతీయ జన సంఘ్ పార్టీని ముఖర్జీ స్థాపించారని అప్పటి నుంచి దినదినా భివృద్ధి చెందుతూ దేశాన్ని పాలిస్తున్న బీజేపీగా మార్పు చెందిందన్నారు. ఆర్ఎస్ఎస్ నిబంధనలతో ఆయన చేసిన సంస్కరణలు నేటి నాయకులకు ఆచరణీయమన్నారు. కూటమి నాయకులు పైడిపాటి శివశంకర్, సమయం ఏసుబాబు, గరికిపాటి రాంబాబు, వీజేఎస్ మాల్యాద్రి, తలారి రాజేష్, బాషా, బోయిన శ్రీనివాస్, పామర్తి రాంబాబు, కొల్లి వరప్రసాద్, బోయిన బాలాజీ, మోరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: శ్యాంప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు ప్రతి బీజేపీ కార్యకర్త కట్టుబడి ఉండాలని, నూజివీడు నియోజకవర్గ బీజేపీ నాయకులు అన్నారు. నూజివీడు మండల, పట్టణ పరిధిలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖండ భారత్ నిర్మాణం, రామరాజ్యస్థాపన సిద్ధాంతాల కోసం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ కలలు కన్నారని, ఆయన ఆశయ సాధనకు ప్రధాని మోదీ అహర్నిశలు కష్టపడుతున్నారన్నారు. బీజేపీ నాయకులు గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు, శివరాజు వసుంధరాదేవి, వైఎస్ దొరై, సాగర్ శర్మ, దోసపాటి జనార్దన్, నెక్కలపు కృష్ణారావు, కన్నెగంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తన జీవితాన్ని దేశ శ్రేయస్సుకు త్యాగం చేసిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని వడ్లమానులో బీజేపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ కన్వీనర్ రంగారావు, మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూరావు, ఉపాధ్యక్షులు రెడ్డి రామారావు, జలసూత్రం శేషగిరి, మైనార్టీ సెల్ నాయకుడు బాషా, పఠాన్ పాల్గొన్నారు.